


Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 218 | శనివారం 31 జనవరి 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

irculated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


## మహాత్మ గాంధీకి
# ప్రధాని, రాష్ట్రపతి నివాళి

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం :



మహాత్మా గాంధీ 78వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం న్యూఢిల్లీలోని రాజ్‌ఘాట్‌లో స్మారక చిహ్నం వద్ద రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సహా పలువురు కేంద్ర మంత్రులు, ఇతర రంగాలకు చెందిన ప్రముఖులు గాంధీకి నివాళులర్పించారు. స్మారక చిహ్నం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళర్పించారు. ఈ ప్రముఖులంతా గాంధీని గుర్తుచేసుకుంటూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.

- మిగతా 2లో..

## ఫిబ్రవరి 11 నుంచి
# ఏపీ అసెంబ్లీ సమావేశాలు

- 14న బడ్జెట్!
- నోటిఫికేషన్ జారీ చేసిన గవర్నర్ అబ్దుల్ నజీర్
- ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగం
- ఫిబ్రవరి 14న వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి పయ్యావుల
- అదే రోజున వ్యవసాయ బడ్జెట్‌ను సమర్పించనున్న మంత్రి అచ్చెన్నాయుడు
- దాదాపు నాలుగు వారాల పాటు కొనసాగనున్న సమావేశాలు

అమరావతి - సూర్య వాస్తవం




ఆంధ్రప్రదేశ్ శాసనసభ బడ్జెట్ సమావేశాలకు ముహూర్తం ఖరారైంది. 16వ శాసనసభ ఐదో సమావేశాలను ఫిబ్రవరి 11వ తేదీ నుంచి నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ అసెంబ్లీ సమావేశాలపై నోటిఫికేషన్ జారీ చేశారు. ఫిబ్రవరి 11న ఉదయం 10 గంటలకు అమరావతిలోని వెలగపూడిలో ఉన్న అసెంబ్లీ హాలులో ఉభయ సభలను (శాసనసభ, శాసనమండలి) ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించడంతో ఈ

- మిగతా 2లో..



## వైసీపీ విష ప్రచారాలను
# తిప్పికొట్టండి

- వైసీపీ చేయకూడని పాపాలు చేసిందన్న లోకేశ్
- కూటమిని చీల్చే కుట్ర చేస్తోందని మండిపాటు
- కూటమిని చీల్చడం ఎవరి వల్ల కాదని వ్యాఖ్య

అమరావతి - సూర్య

వైసీపీ చేయకూడని పాపాలన్నీ చేసిందని మంత్రి నారా లోకేశ్ విమర్శలు గుప్పించారు. తప్పుడు ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. వైసీపీ విష ప్రచారాలను

- మిగతా 2లో..

# పేదల అభ్యున్నతికే ‘పీ4’

- పదేళ్లలో అమరావతి, గుంటూరు, విజయవాడ కలిసిపోతాయి: సీఎం చంద్రబాబు
- గుంటూరు జీజీహెచ్‌లో మాతాశిశు కేంద్రాన్ని ప్రారంభించిన సీఎం
- ఆర్థిక అసమానతలు తగ్గించేందుకే పీ4 కార్యక్రమాన్ని తీసుకొచ్చినట్లు వెల్లడి
- రాష్ట్రవ్యాప్తంగా ప్రజల ఆరోగ్య రికార్డుల డిజిటలైజేషన్ కోసం ‘సంజీవని’ ప్రాజెక్టుకు శ్రీకారం

అమరావతి - సూర్య వాస్తవం



ఎంత ఎత్తుకు ఎదిగినా పుట్టిన గడ్డను మర్చిపోకుండా ప్రవాసాంధ్రులు అందిస్తున్న సేవలు ఎంతో స్ఫూర్తిదాయకమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్)లో పూర్వ విద్యార్థుల సహకారంతో నిర్మించిన ‘కానూరి-జింఖానా’ మాతాశిశు సంరక్షణ కేంద్రాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ కేంద్రం నిర్మాణం కోసం గుంటూరు మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థులు ఏకంగా రూ.100 కోట్లు విరాళంగా సమకూర్చగా, ప్రభుత్వం పరికరాలు, ఫర్నిచర్ కోసం మరో రూ.27 కోట్లు వెచ్చించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ, “సంపాదించిన దానిలో కొంత సమాజ సేవకు కేటాయించినప్పుడు కలిగే సంతృప్తి మాటల్లో చెప్పలేనిది. సమాజంలో ఇంకా మంచితనం మిగిలే ఉందని ప్రవాసాంధ్రులు నిరూపించారు. సాధారణంగా దశాబ్దాల క్రితం విదేశాలకు వెళ్లి స్థిరపడిన వారు జన్మభూమిని మరచిపోతారు. కానీ మీరు చదువుకున్న కళాశాలను గుర్తుపెట్టుకుని 1981లోనే జింఖానా సంస్థను ఏర్పాటు చేసి ఇంత పెద్ద ఎత్తున సాయం చేయడం అభినందనీయం. భవన నిర్మాణంతో పాటు, భవిష్యత్తులో దాని నిర్వహణకు ఆటంకాలు

- మిగతా 2లో..




## లీడర్ సర్టిఫికెట్ అందుకున్న ముఖ్యమంత్రి

- హార్వర్డ్ యూనివర్సిటీలో ‘కెనెడీ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్’లో కోర్సు పూర్తిచేసిన సీఎం రేవంత్‌రెడ్డి
- లీడర్‌షిప్ ఫర్ ది ట్వంటీ ఫస్ట్ సెంచరీ పేరిట నిర్వహించిన తరగతులకు హాజరు

హైదరాబాద్- సూర్య వాస్తవం

అమెరికాలోని ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీలో ‘కెనెడీ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్’లో సీఎం రేవంత్‌రెడ్డి లీడర్‌షిప్ కోర్సు పూర్తి చేశారు. హార్వర్డ్ కెనెడీ స్కూల్ నుంచి సర్టిఫికెట్ అందుకున్నారు. ఈ నెల 25 నుంచి 30 వరకు ‘లీడర్‌షిప్ ఫర్ ది ట్వంటీ ఫస్ట్ సెంచరీ’ పేరిట నిర్వహించిన తరగతులకు

- మిగతా 2లో..

## నేడు పెన్షన్ల పంపిణీ
### - మంత్రి కొండపల్లి శ్రీనివాస్



అమరావతి - సూర్య వాస్తవం

రాష్ట్ర వ్యాప్తంగా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఒకరోజు ముందుగానే ఈ నెల 31న చేపట్టనున్నట్లు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖల మంత్రి కొండపల్లి

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## నా వైపు నుంచి ఎలాంటి
# రాజకీయ సిఫార్సులు రావు

- పనిలో అలసత్వం, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్
- గత ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖను పూర్తిగా నాశనం చేసిందని విమర్శలు
- వేల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపణ
- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని స్పష్టీకరణ

అమరావతి - సూర్య వాస్తవం



“నా వైపు నుంచి ఎలాంటి రాజకీయ ఒత్తిడులు గానీ, సిఫార్సులు గానీ ఉండవు. కష్టపడి పనిచేసే అధికారులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు... ప్రతి అధికారి నిబంధనలకు లోబడి మాత్రమే పని చేయాలి” అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ అధికారులకు స్పష్టం చేశారు. పనిలో అలసత్వాన్ని, నిర్లక్ష్యాన్ని ఏ మాత్రం సహించేది లేదని, నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవడంలో విఫలమైనా కఠినంగా వ్యవహరిస్తామని ఆయన గట్టిగా హెచ్చరించారు. గత ప్రభుత్వంలో పనిచేసిన కొంతమంది అధికారులు ఇంకా పాత నాయకులతో సంబంధాలు కొనసాగిస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందని, ప్రభుత్వ పాలసీల

- మిగతా 2లో..



## సిట్ ఛార్జ్‌షీట్‌లో
# కల్తీ నెయ్యి స్పష్టం

### - మీడియాతో టీటీడీ ఛైర్మన్ బిఆర్ నాయుడు

తిరుపతి - సూర్య వాస్తవం

శ్రీవారి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యిపై క్లీన్ చిట్ అంటూ యాత్రికులను మోసం చేస్తున్నారని, టిటిడి పవిత్రతను భ్రష్టు పట్టించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని టిటిడి ఛైర్మెన్ బిఆర్ నాయుడు చెప్పారు. తిరుపతి శ్రీ పద్మావతి విశ్రాంతి భవనంలో శుక్రవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఛైర్మన్ మాట్లాడుతూ నెయ్యి కల్తీ జరగలేదని చెప్పడం వాస్తవం కాదని, సిట్ ఛార్జ్‌షీట్‌లోనే కల్తీ స్పష్టంగా నమోదయిందని పేర్కొన్నారు. నెయ్యి కొనుగోలు టెండర్ల ప్రక్రియలో నిబంధనల ఉల్లంఘన జరిగిందని,

- మిగతా 2లో..

# మహాత్మ గాంధీకి ప్రధాని, రాష్ట్రపతి నివాళి



(మొదటిపేజీ తరువాయి)

అలాగే, గాంధీ వర్ధంతి సందర్భంగా స్మారక చిహ్నం వద్ద సర్వమత ప్రార్ధనలు నిర్వహించారు. ఈ ప్రార్ధనల్లో గాంధీకి ఇష్టమైన 'రఘుపతి రాఘవ రాజా రామ్'తో సహా అనేక భక్తి గీతాలను ఆలపించారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో కూడా గాంధీ వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించారు. మహాత్మా గాంధీకి ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ నివాళర్పించారు. ఈ సందర్భంగా ఆయన వ్యక్తి కాదని, ఒక ఆలోచన అని రాహుల్ తెలిపారు. గాంధీ మనకు స్వాతంత్ర్యంతో పాటు అధికార బలం కన్నా సత్యం శక్తి గొప్పదనే సందేశాన్ని ఇచ్చారని చెప్పారు. గాంధీ అనే ఆలోచనను చెరిపవేయలేమని, ఎందుకంటే భారతదేశ ఆత్మలో గాంధీ అమరుడని రాహుల్ నివాళిలర్పించారు.

## లీడర్ సర్టిఫికెట్ అందుకున్న ముఖ్యమంత్రి

(మొదటిపేజీ తరువాయి)

ఆయన హాజరయ్యారు. ప్రతి రోజు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు తరగతులు జరిగాయి. 20 దేశాల నుంచి వచ్చిన 60 మంది విద్యార్థులతో కలిసి ఈ తరగతులకు హాజరైనట్టు.. టీచర్స్, తోటి విద్యార్థుల నుంచి ఎంతో నేర్చుకున్నట్టు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి తెలిపారు. ఆ సమయంలో అక్కడ ఉష్ణోగ్రతలు దాదాపు మైనస్ 15 డిగ్రీల సెల్సియస్ నుంచి మైనస్ 24 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉన్నాయి.

## వైసీపీ విష ప్రచారాలను తిప్పికొట్టండి

(మొదటిపేజీ తరువాయి)

తిప్పికొట్టాల్సిన బాధ్యత టీడీపీ కార్యకర్తలదేనని అన్నారు. కూటమిని చీల్చే కుట్ర కూడా చేస్తున్నారని... కూటమి పార్టీలను విడదీయడం ఎవరి వల్ల కాదని చెప్పారు. వైసీపీ నుంచి ఎన్ని ఇబ్బందులు ఎదురైనా... అందరూ కలిసి ఐక్యంగా ఎదుర్కోవాలని చెప్పారు. టీడీపీ టౌన్, వార్డు, మండల స్థాయి అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల కోసం నిర్వహించిన శిక్షణ తరగతుల్లో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని లోకేశ్ సూచించారు. కూటమి పార్టీల నేతల మధ్య సఖ్యత చాలా ముఖ్యమని అన్నారు. తిరుమల ప్రతిష్ఠకు భంగం కలిగించేలా గత వైసీపీ ప్రభుత్వం వ్యవహరించిందని మండిపడ్డారు. కల్తీ నెయ్యితో లడ్డూలు తయారు చేసి, భక్తుల మనోభావాలను గాయపరిచారని విమర్శించారు.

## సిట్ ఛార్జ్‌షీట్‌లో కల్తీ నెయ్యి స్పష్టం

(మొదటిపేజీ తరువాయి)

కొందరికి లాభం చేకూర్చేలా నిబంధనలను మార్చారని ఆరోపించారు. సరైన సామర్థ్యం లేని సంస్థలకు నెయ్యి టెండర్లు అప్పగించారని తెలిపారు. సుమారు రూ.250 కోట్ల 60 లక్షల కిలోల కల్తీ నెయ్యి కొనుగోలు జరిగిందని ఆరోపించారు. ఈ నెయ్యిని పరీక్షించిన ఎన్‌డిడిబి జంతు కొవ్వు ఉందని నివేదిక ఇచ్చినట్లు చెప్పారు. ఒక్క ఆవు కూడా లేకుండా, చుక్క నెయ్యి ఉత్పత్తి సామర్థ్యం లేకపోయినా నెయ్యి తయారు చేశామని చెప్పడం అబద్ధమని, నెయ్యి తయారీలో వాడిన కొన్ని రసాయనాలు అత్యంత ప్రమాదకరమైనవని ఆయన చెప్పారు. ఈ కల్తీ నెయ్యితో సుమారు 20 కోట్ల లడ్డూలు తయారు చేయడం ద్వారా తిరుమల క్షేత్ర పవిత్రతకు తీవ్రమైన భంగం కలిగించారన్నారు. కమీషన్ల కోసమే కొన్ని డెయిరీలను ఎంపిక చేశారని విమర్శించారు. నెయ్యి నాణ్యతపై తుది నిజాలు వెలుగులోకి రావాలంటే మైక్రో డిఎన్ఎ టెస్ట్ తప్పనిసరిగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కొంతమంది ఖాతాల్లోకి వెళ్లిన కోట్ల రూపాయల లావాదేవీలపై పూర్తి స్థాయి దర్యాప్తు జరపాలని సిట్‌ను కోరారు. బ్యాంక్ ఖాతాల్లో కోట్ల రూపాయలు జమ కావడం వాస్తవమా? కాదా? బినామీల వెనుక అసలు పెద్దలు ఎవరో నిగ్గుతేల్చాలన్నారు. టిటిడి పవిత్రతను కాపాడేందుకు ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో టిటిడి బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి, పనబాక లక్ష్మీ, నరేష్‌కుమార్, డాలర్ దివాకర్ రెడ్డి, దర్శన్ పాల్గొన్నారు.

## నేడు పెన్షన్ల పంపిణీ

(మొదటిపేజీ తరువాయి)

శ్రీనివాస్ తెలిపారు. 62.94 లక్షల మంది పింఛనుదారులకు రూ.2,724.09 కోట్లను సచివాలయ సిబ్బంది.. లబ్ధిదారుల ఇళ్లకే వెళ్లి అందజేయనున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2026 జనవరి నెలలో కొత్తగా 7,944 వితుంతు (స్పౌజ్) పెన్షన్లు మంజూరైనట్లు తెలిపారు. చిత్తూరు జిల్లాలోని గుడిపల్లె మండలం బెగ్గిలిపల్లె గ్రామంలో పేదల సేవ కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లబ్ధిదారులకు పెన్షన్లను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. 31న పంపిణీ చేయగా మిగిలిన పెన్షన్లను ఫిబ్రవరి 2న సచివాలయ సిబ్బంది పంపిణీ చేస్తారని తెలిపారు.

# పేదల అభ్యున్నతికే 'పీ4'

(మొదటిపేజీ తరువాయి)

రాకుండా బ్యాంకులో కొంత సొమ్ము డిపాజిట్ చేయడం మీ ముందుచూపునకు నిదర్శనం" అని ప్రశంసించారు.

**పేదల అభ్యున్నతికే 'పీ4'**

రాష్ట్రంలో ఆర్థిక అసమానతలను తగ్గించే లక్ష్యంతోనే తాను 'పీ4' (ప్రజా భాగస్వామ్యంతో పేదరికంపై గెలుపు) కార్యక్రమాన్ని తీసుకొచ్చానని ముఖ్యమంత్రి వివరించారు. "కేంద్ర ప్రభుత్వం రహదారులు, విమానాశ్రయాల వంటి మౌలిక సదుపాయాల కోసం పీ4 మోడల్‌ను ప్రోత్సహిస్తోంది. కానీ నేను పేదల అభ్యున్నతి కోసం పీ4ను అమలు చేస్తున్నాను. పేదలు సంపాదించే స్థాయికి చేరితేనే సమాజంలో ఆర్థిక వ్యత్యాసాలు తగ్గుతాయి. చదువు అనేది ఒక గేమ్ ఛేంజర్. అంబేద్కర్, అబ్దుల్ కలాం వంటి మహనీయులు ఆర్థిక సాయంతోనే ఉన్నత స్థాయికి చేరారు. పీ4 కార్యక్రమం ద్వారా ఇప్పటికే 10.42 లక్షల మందిని లక్షా 2 వేల మంది దాతలు దత్తత తీసుకున్నారు. ప్రవాసాంధ్రులు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములై పేదలకు అండగా నిలవాలి" అని పిలుపునిచ్చారు.

**అమరావతిపై దార్శనికత.. అభివృద్ధిపై ధీమా**

రానున్న పదేళ్లలో గుంటూరు, అమరావతి ప్రాంతాల రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. "గుంటూరు, మంగళగిరి, విజయవాడ కార్పొరేషన్లు కలిసిపోతాయి. 182 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్డు రానుంది. అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా నిర్మించాలన్నది నా లక్ష్యం. ఒకప్పుడు సైబరాబాద్ నిర్మించాం, ఇప్పుడు అమరావతిలో 'క్వాంటమ్ వ్యాలీ'కి శ్రీకారం చుడుతున్నాం. 2047 నాటికి స్వర్ణాంధ్ర లక్ష్య సాధనతో ముందుకు వెళుతున్నాం" అని అన్నారు. 1995లో తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు విద్యుత్ సంస్కరణలు తీసుకొచ్చామని, నేడు దేశం విద్యుత్ రంగంలో అగ్రగామిగా నిలవడం గర్వకారణమని పేర్కొన్నారు.

**ఆరోగ్య సేవల్లో 'సంజీవని' విప్లవం**

టెక్నాలజీని ఉపయోగించి పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో 'సంజీవని' ప్రాజెక్టును ప్రారంభించామని చంద్రబాబు తెలిపారు. "ఈ ప్రాజెక్టు ద్వారా ప్రజలందరి ఆరోగ్య రికార్డులను డిజిటలైజ్ చేస్తాం. ఇప్పటికే కుప్పంలో పైలట్ ప్రాజెక్టు పూర్తయింది. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి దేశానికే ఆదర్శంగా నిలుస్తాం. 2026 నాటికి 72 లక్షల మంది రోగుల డేటాను సేకరించి, రియల్ టైమ్ మానిటరింగ్ చేస్తాం. త్వరలో ఎయిర్ అంబులెన్సులు, 2026 నాటికి డ్రోన్ అంబులెన్సులు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నాం" అని వివరించారు.

**దాతృత్వానికి నిలువుటద్దం**

గుంటూరు మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థుల దాతృత్వాన్ని ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినం దించారు. 2.69 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 5 అంతస్తులుగా నిర్మించిన ఈ కేంద్రంలో మొత్తం 600 పడకలు ఉన్నాయి. కేంద్ర మంత్రి, గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ రూ.80 కోట్ల వరకు విరాళాలు సేకరించడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. డాక్టర్ గవిని ఉమాదేవి (రూ.22 కోట్లు), నళిని-వెంకట్ తేళ్ల (రూ.8 కోట్లు) సహా పలువురు దాతలు భారీగా విరాళాలు అందించారు. నాట్కో ఫార్మా కూడా వివిధ అవసరాల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేసిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి సత్యకుమార్, పలువురు ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

# నా వైపు నుంచి ఎలాంటి రాజకీయ సిఫార్సులు రావు

(మొదటిపేజీ తరువాయి)

అమలులో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పారు. ప్రజల సంతోషం, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రభుత్వ ఆశయాలను ప్రజలకు చేరవేయడంలో అధికారులు చిత్తశుద్ధితో, జవాబుదారీతనంతో వ్యవహరించాలని పవన్ కల్యాణ్ కోరారు.

శుక్రవారం నాడు విశాఖపట్నం కలెక్టరేట్‌లో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్ డబ్ల్యూ ఎస్, ఇంజినీరింగ్ విభాగాల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం, పల్లెపండగ 1.0, 2.0, జల్ జీవన్ మిషన్ వంటి పథకాల పురోగతిపై ఆరా తీశారు. లక్ష్యాలను ఎందుకు పూర్తి చేయలేకపోయారనే దానిపై అధికారుల నుంచి వివరణ తీసుకున్నారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ, "కూటమి ప్రభుత్వం ప్రతి అడుగులో ప్రజలకు మంచి చేయాలన్న లక్ష్యంతో ఉంది. నాకు చప్పట్లు, పొగడ్తలు అవసరం లేదు. పని మాత్రమే కావాలి. ఉన్నత స్థాయి అధికారి నుంచి ఫీల్డ్ అసిస్టెంట్ వరకు ప్రతి ఒక్కరు నిబద్ధతతో పనిచేయాలి" అని అన్నారు. గత ప్రభుత్వంపై ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. "గత ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసింది.

పంచాయతీల్లో స్వపరిపాలనకు చోటు లేకుండా చేసి, ఆర్థిక క్రమశిక్షణ లేకుండా వేల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసింది. జల్ జీవన్ మిషన్ లక్ష్యాలను నీరుగార్చి, రూ.4 వేల కోట్లు దుర్వినియోగం చేశారు. పనులు చేసినట్టు రికార్డులు సృష్టించారు గానీ, ఒక్క ఇంటికి కూడా నీరు ఇచ్చిన దాఖలాలు లేవు" అని ఆరోపించారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుకుంటూ, వ్యవస్థలను బలోపేతం చేస్తూ ముందుకు వెళుతున్నామని తెలిపారు. పంచాయతీరాజ్ శాఖను ప్రభావవంతమైన శాఖగా తీర్చిదిద్దేందుకు సంస్కరణలు అమలు చేస్తున్నామని, ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న 10 వేల ప్రమోషన్లను ఎలాంటి ప్రలోభాలకు తావులేకుండా పూర్తి చేసి తమ చిత్తశుద్ధిని చాటుకున్నామని పవన్ గుర్తుచేశారు. ఉమ్మడి కడప జిల్లాలో ఓ ఎంపీడీవోపై దాడి జరిగితే స్వయంగా వెళ్లి భరోసా ఇచ్చామని, ఉద్యోగులకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధికి ఎంతో కష్టపడుతున్నామని, కేంద్రం నుంచి నిధులు సాధిస్తున్నామని, తమ కష్టానికి సార్ధకత చేకూరేలా అధికారులు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, ఉపాధి హామీ పథకం డైరెక్టర్ షణ్ముఖ్ కుమార్, విశాఖపట్నం కలెక్టర్ డా. ఎ. మల్లికార్జున, వివిధ శాఖల రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



# గాంధీజీ బోధనలను ప్రతి ఒక్కరూ పాటించాలి

## - ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి - సూర్య వాస్తవం**

మహాత్మా గాంధీ బోధనలైన సత్యం, అహింస, శాంతి, సేవ అనే సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ నిత్యం పాటించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. జాతిపిత మహాత్మా గాంధీ 78వ వర్ధంతి సందర్భంగా ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అహింసా విధానంతో కోట్ల మంది దేశ ప్రజలను ఒక్కతాటిపై నడిపి గాంధీజీ స్వాతంత్ర్యం సాధించారని ఈ సందర్భంగా సామాజిక మాధ్యం ఎక్స్‌లో పేర్కొన్నారు. స్వదేశీ, మహిళా సాధికారత, గ్రామ స్వరాజ్యం, పేదరిక నిర్మూలన వంటి ఆయన ఆశయాలను నిజం చేసేందుకు కృషి చేద్దామని సూచించారు.

**టిడిపి కార్యాలయంలో గాంధీజీ వర్ధంతి**

జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమం టిడిపి కార్యాలయంలో శుక్రవారం జరిగింది. గాంధీజీ చిత్రపటానికి పార్టీ కార్యాలయ కార్యదర్శి పి అశోక్ బాబు, మాజీ ఎమ్మెల్సీ మంతెన సత్యనారాయణరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీజీ చూపిన సత్యం, అహింసా ఎప్పటికీ ఆచరణీయమని ఈ సందర్భంగా అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో ఆయన పోషించిన పాత్ర అద్వితీయమని, ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతి కార్యకర్త నడుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మీడియా కో-ఆర్డినేటర్ దారపనేని నరేంద్రబాబు, నేతలు సూర్యప్రకాష్, వల్లూరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# 'ఐగాట్ కర్మయోగి' ప్లాట్‌ఫామ్‌లో ఏపీ సరికొత్త రికార్డు

- కోటికి పైగా ఎన్‌రోల్‌మెంట్లు పూర్తి చేసిన తొలి రాష్ట్రంగా ఘనత
- ప్రభుత్వ ఉద్యోగుల నిబద్ధతను కొనియాడిన సీఎం చంద్రబాబు
- నైపుణ్యం గల పరిపాలన కోసమే ఈ కార్యక్రమమని వెల్లడి
- ఈ ఘనతలో ఏపీఎస్‌డీపీఎస్ పాత్రను అభినందించిన సీఎం

**అమరావతి - సూర్య వాస్తవం**

ప్రభుత్వ ఉద్యోగుల నైపుణ్యాలను పెంచే 'ఐగాట్ కర్మయోగి' పోర్టల్‌లో ఆంధ్రప్రదేశ్ సరికొత్త రికార్డు సృష్టించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఇది అద్భుతమైన వార్త అని, ప్రభుత్వ ఉద్యోగులు నిరంతర అభ్యాసంపై చూపుతున్న నిబద్ధతకు ఈ ఘనత నిదర్శనమని ఆయన అన్నారు. నైపుణ్యం, చురుకుదనం, భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా పరిపాలనను నిర్మించడమే తమ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. ఐగాట్ కర్మయోగి ప్లాట్‌ఫామ్‌పై కోటికి పైగా కోర్సు ఎన్‌రోల్‌మెంట్లు, 80 లక్షలకు పైగా కోర్సుల పూర్తితో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో నిలిచింది. రాష్ట్రంలోని ఉద్యోగులు మొత్తం 4,290 కోర్సులలో ఈ శిక్షణ పూర్తిచేశారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా ముందుకు నడిపిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక సంస్థను (ఆ్ర్రాఆణ్రూూ) సీఎం ప్రత్యేకంగా అభినందించారు. కేంద్ర ప్రభుత్వం సైతం ఆంధ్రప్రదేశ్ సాధించిన ఈ ఘనతను ప్రశంసించింది. ఉద్యోగుల సామర్థ్యాన్ని పెంచడం ద్వారా పౌర సేవలపై సానుకూల ప్రభావం చూపడంలో రాష్ట్రం ముందుందని కొనియాడింది. ఏపీ సాధించిన ఈ విజయం దేశంలోని ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొంది. ఉద్యోగులకు శిక్షణ ఇచ్చి వారి సామర్థ్యాన్ని పెంపొందించడంలో రాష్ట్ర ప్రభుత్వం చూపిస్తున్న నిబద్ధతకు ఇది నిలువుటద్దమని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# సంపాదకీయం

## మరో యుద్ధం తప్పదా...



పశ్చిమాసియాలో యుద్ధమేఘాలు కమ్ముకుంటున్నాయి. వెనెజెవెలా అధ్యక్షుడిని కిడ్నాప్ చేసిన తర్వాత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యుద్ధ కాంక్షతో రగిలిపోతున్నాడు. ఇప్పటికే ఆర్థిక సంక్షోభంతో రగిలిపోతున్న ఇరాన్‌పై యుద్ధానికి సిద్ధమవుతున్నాడు. ఇప్పటికే ఇరాన్‌కు పలుమార్లు వార్నింగ్ ఇచ్చాడు. ఇక ఇప్పుడు వార్‌కు రెడీ అవుతున్నాడు. ఆయుధాలు మోహరిస్తున్నాడు. ఇప్పటికే పాకిస్తాన్ బలగాలను ఇరాక్ సరిహద్దుకు తరలించాడు. అమెరికా యుద్ధ విమానాలను రెడీ చేశాడు. తాజాగా అమెరికాకు చెందిన అబ్రహం లింకన్ వాహక నౌక ఇటీవల ఇక్కడికి చేరింది. దీనితో పాటు యూఎస్ఎస్ ఫ్రాంక్ ఈ. పీటర్సన్ జూనియర్, యూఎస్ఎస్ స్ప్రూయాన్స్ డెస్ట్రాయర్లు, యూఎస్ఎస్ మిషెల్ మార్ఫీ కూడా ఇరాన్‌కు తరలించాడు. పశ్చిమాసియాలో మొన్నటిదాకా ఇజ్రాయిల్, పాలస్తీనా దేశాల మధ్య దాడులు కొనసాగేవి. ఈ రెండు దేశాల మధ్యలోకి ఇరాక్, సిరియా కూడా వచ్చాయి. దీంతో దాడులు మరింత పెరిగిపోయాయి. ఇప్పుడు అక్కడ పరిస్థితులు నెమ్మదిగా మారిపోతున్న వేళ.. పశ్చిమాసియాలో మరోసారి యుద్ధ వాతావరణం ఏర్పడిందిఅమెరికాకు చెందిన యుద్ధ విమాన వాహన నౌక యుఎస్ఎస్ అబ్రహం లింకన్ పశ్చిమాసియా కు చేరుకోవడం కలకలాన్ని కలిగిస్తోంది. దీంతో ఇరాన్ పై అమెరికా దాడులు చేసే అవకాశం ఉందని ప్రచారం మొదలైంది.అబ్రహం లింకన్ యుద్ధ విమాన వాహక నౌక మాత్రమే కాకుండా, యూఎస్ఎస్ ఫ్రాంక్ ఈ పీటర్సన్ జూనియర్, యూఎస్ఎస్ స్ప్రూయాన్స్ డెస్ట్రాయర్లు, యూఎస్ఎస్ మిషెల్ మార్ఫీ వంటి యుద్ధ విమాన వాహక నౌకలు ఇరాన్ సరిహద్దుల్లోకి వెళ్లినట్టు వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే అమెరికాకు చెందిన సెంట్రల్ కమాండ్ ఈ యుద్ధ విమాన వాహక నౌకలు అక్కడికి వచ్చాయని తెలిపింది.ఈ విమానాలు ఇరాన్ సరిహద్దుల్లోని అరేబియా సముద్రంలో ల్యాండ్ అవ్వలేదు. హిందూ సముద్రంలో అవి దిగడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఇది మాత్రమే కాకుండా యుద్ధ విమానాలను, కార్గో విమానాలను ఈ ప్రాంతానికి తీసుకొస్తున్నట్టు తెలుస్తోంది. కొంతకాలంగా ఇరాన్ దేశంలో అక్కడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు ఆందోళనలు చేస్తున్నారు. ఘర్షణలో జరుగుతున్న నేపథ్యంలో వేరాదిమంది ఇప్పటికే చనిపోయారు. అక్కడి ఆందోళనలకు ట్రంప్ బాసటగా నిలిచారు. ఒకవేళ అక్కడి ప్రభుత్వం ఆందోళనకారులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటే మాత్రం తాము రంగంలోకి దిగుతామని ట్రంప్ హెచ్చరించారు. ట్రంప్ చేసిన వ్యాఖ్యల తర్వాత అమెరికా సైన్యం భారీగా ఇరాన్ దిశగా వెళ్లడం రకరకాల సంకేతాలు ఇస్తుంది. ట్రంప్ ఆదేశాలు ఇచ్చిన మరుక్షణంలోనే ఇరాన్ మీద అమెరికా దాడి చేసే అవకాశాలు తెలుస్తోంది. మరోవైపు అమెరికాతో ఇరాన్ చర్చలు జరిపే అవకాశం ఉందని అంతర్జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. చర్చలు ముందుకు సాగితే పరిణామాలు వేగంగా మారిపోతాయని అంతర్జాతీయ విశ్లేషకులు చెబుతున్నారు.యూఎస్ సెంట్రల్ కమాండ్ దీనిని నిర్ధారించింది. ప్రాంత స్థిరత్వం, భద్రతా కారణాల దృష్ట్యా ఈ చర్యలు తీసుకున్నామని తెలిపింది. ఈ నౌబల బృందం ఆరబియా సముద్రం సరిహద్దుల్లో మాత్రమే కాక, హిందూ మహాసముద్రంలో కూడా వెళ్లేందుకు సిద్ధమవుతోంది. ఫలితంగా, ప్రాంతంలో అమెరికా సైనికుల సంఖ్య గణనీయంగా పెరిగింది.పెంటగాన్ ఇంకా ఎక్కువ ఫైటర్ జెట్‌లు, సైనిక కార్గో విమానాలను ఈ దిశలోకి తరలించే యోచనలో ఉంది. ఇరాన్‌లో పొలిటికల్ అస్థిరతలు, ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు జరుగుతున్నాయి. ఈ ఘటనల్లో వేల మంది మరణించినట్లు అంచనా. ఆందోళనలకు మద్దతుగా నిలబడిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రభుత్వం ఏమైనా కఠిన చర్యలు తీసుకుంటే జోక్యం చేసుకుంటామని హెచ్చరించారు. దీని ఫలితంగా భారీ సైనిక బలగాలను రెడీ చేస్తున్నామని ప్రకటించారు. ఇది రెండు దేశాల మధ్య ఉద్రిక్తాలను మరింత పెంచింది.ఒకవైపు యుద్ధ విమానాలు, నౌకలను మోహరిస్తున్న అమెరికా.. మరోవైపు ఇరాన్ చర్చలకు ముందుకు వస్తే తాము సిద్ధమని అమెరికా అధికారి తెలిపారు. వెనెజువెలాపై సైలెంట్ ఆపరేషన్ సక్సెస్ అయిన తర్వాత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యుద్ధ కాంక్షతో రగిలిపోతున్నాడు. ఈ క్రమంలో ఇరాన్‌లో ఆర్థిక సంక్షోభంతో ప్రజలు నిరసనలు తెలుపుతున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని ఇరాన్‌పై యుద్ధానికి సిద్ధమవుతున్నాడు. ఖమేనీ ప్రభుత్వాని మార్చడమే లక్ష్యంగా పెట్టుకున్నాడు, ఈమేరకు హెచ్చరికల మీద హెచ్చరికలు చేస్తున్నాడు. దీంతో నిరసనకారులు కూడా అమెరికావైపు ఆశగా చూస్తున్నారు. గతంలో ఒకసారి దాడి చేసిన అమెరికా ఈసారి పూర్తిస్థాయి యుద్ధానికి సిద్ధమవుతోంది.అమెరికా అబ్రహం లింకన్ యుద్ధ నౌకను ఇరాన్ దిశగా పంపుతోంది. శుక్రవారానికి సిద్ధంగా ఉండాలని ఇరాన్ నౌకలను అడ్డుకోవాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఇజ్రాయెల్ దళాలు కూడా అలర్ట్‌లో ఉన్నాయి. దీంతో అమెరికా ఇరాన్ డోమ్ యాక్టివేట్ చేసి, ఎయిర్ స్ట్రైక్‌లకు సిద్ధపడుతోంది. అమెరికాతో కలిసి దాడికి ఇజ్రాయెల్ కూడా రెడీ అయింది.భూమిపై నుంచి దాడులు చేయకుండా ఎయిర్ స్ట్రైక్‌లు చేయాలని అమెరికా భావిస్తోంది. భూతల దాడులు చేస్తే ఐఆర్‌జీసీ అడ్డుకుంటుంది. అమెరికా సైనికులను చంపే ప్రమాదం ఉంది. అందుకే అమెరికా ఐఆర్‌జీసీని తీవ్రవాద సంస్థగా ప్రకటించింది. ప్రపంచ దేశాలతోనూ ప్రకటింపజేసి ఇరాన్‌పై దౌత్యపరమైన ఒత్తిడి పెంచింది.తాజా పరిణామాల నేపథ్యంలో చైనా సంచలన ప్రకటన చేసింది. ఇరాన్‌పై యుద్ధం చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనాల్సి ఉంటుందని హెచ్చరించింది. పాలస్తీన, గత ఇరాన్ దాడుల సమయంలో ఇలాంటి స్టేట్‌మెంట్‌లు జారీ చేసింది. అయినప్పటికీ, ఇరాన్‌కు సరైన మద్దతు ఇవ్వకుండా బెదిరింపులకు మాత్రమే దిగుతోంది.ఈ టెన్షన్ చమురు ధరలు, గ్లోబల్ ట్రేడ్‌ను ప్రభావితం చేస్తాయి. చైనా హెచ్చరిక అమెరికా వ్యూహాలను ప్రశ్నిస్తూ, మధ్యప్రాచ్య స్థిరత్వానికి సవాల్‌గా మారింది. దౌత్య ప్రయత్నాలు ఫలిస్తాయా అనేది ఆసక్తికరం.టెహ్రాన్‌కు చర్చలు సాగించేందుకు అవసరమైన అడుగులు ఇప్పటికే తెలుసని చెప్పారు. మొత్తంగా పశ్చిమాసియాలో మళ్లీ అలజడి మొదలైంది.

# పవన్ ఎందుకు మౌనం

**కడప – సూర్య వాస్తవం**



ఇటీవల జరిగిన విమాన ప్రమాదం దేశవ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ప్రమాదంలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ మృతి చెందడం రాజకీయ వర్గాలనుగ్ర్భ్రాంతికి గురి చేసింది. వివిధ పార్టీల నేతలు సంతాపం తెలియజేశారు. ఈ క్రమంలో ఢిల్లీ పర్యటనలో ఉన్న జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కూడా మీడియా ముందుకు వచ్చి తన సంతాపాన్ని వ్యక్తం చేశారు. అజిత్ పవార్ మరణం చాలా బాధాకరమని, ఇది దేశానికి తీరని లోటని ఆయన వ్యాఖ్యానించారు. పవన్ కళ్యాణ్ ముఖంలో ఆ సమయంలో స్పష్టమైన విషాదం కనిపించిందిఅయితే అదే సమయంలో మీడియా ప్రతినిధులు జనసేనకు చెందిన ఒక ఎమ్మెల్యేపై వచ్చిన ఆరోపణల గురించి ప్రశ్నించారు. కానీ పవన్ కళ్యాణ్ ఆ అంశంపై స్పందించకుండా అక్కడినుంచి వెళ్లిపోయారు. దీనినే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పెద్దగా హైలైట్ చేస్తోంది. పవన్ కళ్యాణ్ ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా తప్పించుకున్నారని విమర్శలు గుప్పిస్తోంది. మరోవైపు జనసేన కార్యకర్తలు మాత్రం తమ నాయకుడు నిజంగా బాధలో ఉన్నారని, ఆ పరిస్థితిలో ఇతర అంశాలపై మాట్లాడకపోవడం సహజమేనని చెబుతున్నారు. అయినప్పటికీ ఈ వ్యవహారం రాజకీయంగా చర్చకు దారి తీసింది.రైల్వే కోడూరు నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అంశంలో జనసేన నాయకత్వం తీసుకున్న వైఖరిపై కూడా విభిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో తెలుగుదేశం పార్టీకి చెందిన ఎమ్మెల్యేలపై ఇలాంటి ఆరోపణలు వచ్చినప్పుడు చంద్రబాబు నాయుడు తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకున్న ఉదాహరణలు ఉన్నాయి. కోనేటి ఆదిమూలంపై ఆరోపణలు వచ్చిన వెంటనే సస్పెన్షన్ వంటి నిర్ణయాలు తీసుకున్నారు. మరికొందరి విషయంలో విచారణ కమిటీలను కూడా ఏర్పాటు చేశారు.అయితే జనసేన ఎమ్మెల్యే విషయంలో మాత్రం వివాదం చాలా రోజులుగా కొనసాగుతున్నా, పార్టీ స్థాయిలో స్పష్టమైన చర్యలు కనిపించకపోవడం విమర్శలకు తావిస్తోంది. సమస్యను మౌనంగా ఎదుర్కోవడం, దిద్దుబాటు చర్యలు ఆలస్యం కావడం వల్ల పార్టీకి ఇబ్బందికర పరిస్థితి ఏర్పడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పవన్ కళ్యాణ్ ఎప్పుడూ విలువలు, నైతికత, మంచి పాలన గురించి మాట్లాడుతుంటారు. కానీ అదే సమయంలో జనసేన నేతలపై కూడా లైంగిక వేధింపుల వంటి ఆరోపణలు రావడం ఆయన లక్ష్యాలకు విరుద్ధంగా మారుతోందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.మంచి పాలన అందించాలన్న పవన్ కళ్యాణ్ ఆశయాన్ని కిందిస్థాయిలో కొందరు నేతల వ్యవహారాలు దెబ్బతీస్తున్నాయనే భావన ఉంది. ఈ పరిస్థితి ఆయనను వ్యక్తిగతంగా కూడా కలచివేస్తోందని పార్టీ వర్గాలు అంటున్నాయి. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే పార్టీ స్థాయిలో స్పష్టమైన విధానం, వేగవంతమైన చర్యలు అవసరమని పలువురు అభిప్రాయపడుతున్నారు. అప్పుడే జనసేన ప్రజల్లో పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోగలదన్న చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది.

# టార్గెట్ 150 ప్రారంభించేసిన జగన్

**విజయవాడ – సూర్య వాస్తవం**



ఒకటిన్నర సంవత్సరం నేను పాదయాత్రతో ప్రజల మధ్యే ఉంటాను. 150 నియోజకవర్గాల్లో పాదయాత్ర చేస్తాను. జగన్ 2.0లో కార్యకర్తలకు పెద్దపీట ఉంటుందని జగన్ మోహన్ రెడ్డి అన్నారు. మాటమీద నిలబడే ప్రభుత్వం ఉండేది. మాట ఇస్తే దాన్ని నిలబెట్టుకోవాలన్న తపన, తాపత్రయం ఉండేది. చంద్రబాబు నాయుడు మళ్లీ అధికారంలోకి వచ్చాక ఉన్న పథకాలన్నీ రద్దైపోయాయని జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు చెప్పిన సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ అబద్ధాలుగా తేలిపోయాయి. సంక్రాంతిరోజు చూస్తే.. ప్రభుత్వమా..? జంగిల్‌రాజ్ అన్నట్లు అనిపించింది. చూడాలి. సోషల్ మీడియాలో వీడియోలు చూస్తే ఆశ్చర్యం వేస్తోంది. మొబైల్ రికార్డింగ్ డ్యాన్సులు నడిపారు. తాగరా.. తాగి చిందేయరా.. అన్న రీతిలో జరిగాయి. అటవిక రాజ్యంలో ఉన్నామా అనిపిస్తోందని జగన్ అగ్రహం వ్యక్తం చేశారు.కోడి పందాలు నడపడానికి వేలం పాటలు నిర్వహించారు. పులివెందులలోనూ కోడిపందాలకు వేలంపాటలు పెట్టారు. ప్రభుత్వమే దగ్గరుండి చేయిస్తోంది.. వచ్చిన సొమ్మును ఎమ్మెల్యేలు, చంద్రబాబు, లోకేశ్, పోలీసు అధికారులు పంచుకున్నారని జగన్ ఆరోపించారు. భీమవరం డీఎస్పీ మాటలు వింటే ఆశ్చర్యంవేసింది. డీఎస్పీ ఊపేయ్.. కుదిపేయ్.. అంటున్నాడు. మనం ఏ సమాజంలో ఉన్నామో అర్ధంకావడం లేదు. రాష్ట్రం జంగిల్ రాజ్ అయ్యింది. బరితెగింపునకు అడ్డులేకుండా పోయింది. విచ్చలవిడిగా మనం ఊహించని స్థాయికి వెళ్లిపోయిందని జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.రైల్వేకోడూరు ఎమ్మెల్యే ఒక ప్రభుత్వ ఉద్యోగి అయిన మహిళను బెదిరించి, భయపెట్టాడు. ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ వేధింపులు భరించలేక ఓ మహిళ ఆత్మహత్యాయత్నం చేసుకుందిసత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మహిళను బలాత్కారం చేసి చివరకు అధికార దుర్వినియోగం కేసును క్లోజ్ చేయించుకున్నాడు. మంత్రి సంధ్యారాణి పీఏపై ఒక ప్రభుత్వ ఉద్యోగి అయిన మహిళ ఫిర్యాదు చేస్తే.. అరెస్టు చేయాల్సిందిపోయి, బాధిత మహిళను జైలుకు పంపారని జగన్ అన్నారు. మరో మంత్రి వాసంశెట్టి సుభాష్ రికార్డింగ్ డ్యాన్సులు వేశాడురాష్ట్రం జంగిల్ రాజ్ లా మారిపోయిందని జగన్ అన్నారు.పాదయాత్రపై జగన్ మాట్లాడుతూ.. ఒకటిన్నర సంవత్సరం నేను పాదయాత్రతో ప్రజల మధ్యే ఉంటాను. 150 నియోజకవర్గాల్లో పాదయాత్ర చేస్తాను. జగన్ 2.0లో కార్యకర్తలకు పెద్దపీట ఉంటుందని జగన్ మోహన్ రెడ్డి అన్నారు. గతంలో నేను కూడా పాలనమీద ఎక్కువ దృష్టి పెట్టాను. కార్యకర్తలకు చేయాల్సింది చేయలేకపోయి ఉండొచ్చు. ఇప్పుడు కార్యకర్తలకే పెద్దపీట ఉంటుంది. కార్యకర్తల ద్వారా ప్రజలకు మరింత మంచి జరిగేలా ఉంటుందని జగన్ అన్నారు.

# జంపింగ్ జంపాంగ్‌లు

**కరీంనగర్– సూర్య వాస్తవం**



ఎన్నికలు వచ్చాయంటే చాలు జంపింగ్ జపాంగ్ ఘటనలు పెరిగిపోతుంటాయి. పార్టీ తనకు సీటు ఇవ్వలేదని, మరో పార్టీ కండువా కప్పుకుంటారు. అక్కడ చేదు అనుభవం ఎదురైతే, మరో పార్టీలోకి లేక నేతల బుజ్జగింపులతో తిరిగి సొంతపార్టీలోకి తిరిగి వస్తుంటారు.

తెలంగాణ పురపాలక ఎన్నికల సమ యంలో జగిత్యాల జిల్లా కోరుట్లలో ఇలాంటి సీన్ రిపీట్ అయింది. కౌన్సిలర్ టికెట్ కోసం ఒక నాయకుడు ఉదయం ఒక పార్టీలో చేరి, రాత్రికి మరో పార్టీ గూటికి చేరుకోవడం స్థానికంగా చర్చనీయాంశమైంది. కోరుట్ల పట్టణంలోని 8వ వార్డు నుంచి పోటీ చేసేందుకు తోట గంగాధర్ అనే నాయకుడు కొద్ది రోజులుగా కాంగ్రెస్ టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. అదే వార్డు నుంచి పార్టీ తరఫున మరొకరు ప్రయత్నిస్తుండటం, తనకు టికెట్ హామీ రాకపోవడంతో ఉదయం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. గురువారం ఉదయం బీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, గంగాధర్ ఇంటికి స్వయంగా వెళ్లి ఆయనకు, ఆయన మద్దతుదారులకు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తోట గంగాధర్‌తో మాజీ కౌన్సిలర్ హమీద్, 20 మంది యువకులు గులాబీ కండువా కప్పుకున్నారు.ఈ విషయం కాంగ్రెస్ ముఖ్య నాయకులకు తెలియడంతో వారు వెంటనే అప్రమత్తమయ్యారు. రాత్రికి తోట గంగాధర్‌ను మెట్‌పల్లిలోని కాంగ్రెస్ పార్టీ ఆఫీసుకు పిలిపించి చర్చలు జరిపారు. చివరకు 8వ వార్డు అభ్యర్థిగా గంగాధర్‌ను ప్రకటిస్తూ, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జువ్వాడి నర్సింగరావు ఆయనకు కండువా కప్పి తిరిగి పార్టీలోకి చేర్చుకున్నారు. సీటు కోసం జంపింగ్ జపాంగ్ అంటూ స్థానికులు అంటున్నారు.

## దోమల నియంత్రణ మనందరి బాధ్యత

### - సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య



**పులివెందుల - సూర్య వాస్తవం :** పులివెందుల అర్బన్ పరిధిలోని రోటరీపురంలో సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య ఆధ్వర్యంలో ఇంటింటా ఫీవర్ సర్వే, లార్వా సర్వే విస్తృతంగా నిర్వహించి దోమకాటు వలన వచ్చు వ్యాదుల గురించి అవగాహనా కల్పించడమైంది. సర్వే సందర్భంగా ప్రతి ఇంటిని సందర్శించి, కుటుంబ సభ్యుల్లో ఎవరైనా జ్వరంతో బాధపడుతున్నారా అనే విషయాన్ని విచారించి, మలేరియా మరియు డెంగ్యూ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఇంటి ప్రాంగణాలు, నీటి ట్యాంకులు, కుండీలు, డ్రములు వంటి చోట్ల నిల్వ నీటిలో దోమల లార్వా ఉన్నాయా లేదా అన్నది పరిశీలించి, లార్వా నిర్మూలనకు అబేట్ పిచికారీ చేయడమైనది. ఈ కార్యక్రమంలో సిద్దయ్య మాట్లాడుతూ వర్షాకాలంలో దోమల వృద్ధి అధికంగా ఉంటుంది. అందువల్ల ప్రజలు తమ ఇళ్లలో నిల్వ నీటిని తరచుగా ఖాళీ చేయాలి, నీటి ట్యాంకులకు మూతలు పెట్టాలి, దోమల నుండి రక్షణ కోసం దోమతెరాలు వాడాలి అని సూచించారు. అలాగే, జ్వరం వచ్చినప్పుడు తక్షణం ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని ప్రజలకు సిద్దయ్య సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు సోమలింగారెడ్డి, సావిత్రి, ఆశా కార్యకర్తలు మేరీ పద్మజ, ఇందిరాదేవి పాల్గొన్నారు.

## మట్టిలో మాణిక్యం..చదువులో ఉన్నతం

### - జనసేన నేత దాసరి రవిశంకర్
### - గ్రూప్-2 విజేత అనితకు ఘన సత్కారం



**వేంపల్లె - సూర్య వాస్తవం :** మట్టిలో మాణిక్యంలా వికసించి చదువులో ఉన్నతంగా రానించిన గ్రూప్- 2 ఫలితాల విజేత నల్ల బోతుల అనిత ని, జనసేన పులివెందుల నియోజకవర్గం సీనియర్ నేత డా. దాసరి రవిశంకర్ అభినందించారు. శుక్రవారం స్థానిక శ్రీరామనగర్ ప్రాంతానికి చెందిన అనిత ని కలిసి ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదరికం నుంచి వచ్చి కఠినశ్రమ, ఏకాగ్రతతో ఉన్నత విద్య అభ్యసించి.. గ్రూప్-2 ఫలితాల్లో నల్లబోతుల అనిత విజేతగా నిలవడం గర్వించదగ విషయ మన్నారు. అనితకు తల్లిదండ్రులు లేకపోయినా భర్త శ్రీనివాసులు, అత్త మామ ల సహకారంతో అధ్భుతమైన ఫలితం సాధించి రాష్ట్ర ప్రభుత్వ ట్రెజరీ విభాగంలో డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీ ఉద్యోగానికి ఎంపికైనట్లు తెలిపారు. భవిష్యత్ లో ఉద్యోగ రీత్యా మంచి పేరు తెచ్చు కొని.. గ్రూప్-1 వంటి పోస్టులు సాధించేలా కృషి చేయాలని సూచించారు. అలాగే ఈ విజయం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేస్తూ.. ప్రోత్సాహం అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఆంజనేయులు, నాగమల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఫీల్డ్ విజిట్ పౌల్ట్రీ ఫామ్ సందర్శన



**సింహాద్రిపురం- సూర్య వాస్తవం :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సింహాద్రి పురంలో 9వ తరగతి విద్యార్థులకు జీవశాస్త్రం సబ్జెక్ట్‌లోని (పశుపోషణ) అధ్యాయాన్ని మరింత స్పష్టంగా, ప్రాక్టికల్‌గా అర్థమయ్యేలా చేయడానికి లావనూర్ గ్రామం సమీపంలో ఉన్న పౌల్ట్రీ ఫామ్‌కు ఫీల్డ్ విసిట్ నిర్వహించారు. ఈ ఫీల్డ్ విజిట్ ద్వారా విద్యార్థులు పుస్తకాల్లో చదివిన విషయాలను ప్రత్యక్షంగా చూసి తెలుసుకునే అవకాశం పొందారు. పౌల్ట్రీ ఫామ్‌లో కోళ్ల పెంపకం విధానం, ఫామ్ ఏర్పాటు చేసే విధానం, ఆహార నిర్వహణ, శుభ్రత, ఆరోగ్య సంరక్షణ వంటి అంశాలను ఫామ్ యజమాని సత్య రెడ్డి మరియు ఉపాధ్యాయులు వివరించారు.

**ఫీల్డ్ విసిట్‌లో వివరించిన ముఖ్య అంశాలు:**

పౌల్ట్రీ ఫామ్ ఏర్పాటుకు అవసరమైన స్థలం, సౌకర్యాలు, కోళ్ల రకాలు (బ్రాయిలర్, లేయర్ కోళ్లు), కోళ్లకు ఇవ్వాల్సిన ఆహారం, నీటి సరఫరా వ్యాధులు, నివారణ చర్యలు పౌల్ట్రీ రంగంలో ఎదురయ్యే సమస్యలు, పరిష్కార మార్గాలు. ఉపాధి అవకాశాలుగా పౌల్ట్రీ పరిశ్రమ ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెడ్‌మాస్టర్, సతీష్ ప్రభు, జీవశాస్త్ర ఉపాధ్యాయులు సూర్యచంద్ర రెడ్డి, జయ ప్రకాష్ రెడ్డి, పద్మనాభ రెడ్డి పాల్గొని విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. ఉపాధ్యాయులు విద్యార్థుల సందేహాలకు సమాధానాలు చెబుతూ, పాఠ్యాంశాన్ని జీవన నైపుణ్యాలతో అనుసంధానం చేసి వివరించారు.



# పరిశ్రమలకు అన్ని రకాల అనుమతులు
# ఆలస్యం లేకుండా మంజూరు చేయాలి

### - పీఎంఈజిపి, ఉద్యమ్ తదితర పథకాల లక్ష్యాల సాధనకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలి
### - అనంతపురం ఇన్‌చార్జి కలెక్టర్ విష్ణు చరణ్



**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం :** జిల్లాలో పరిశ్రమల ప్రోత్సాహానికి ఆయా శాఖల అధికారులు ఎప్పటికప్పుడు అనుమతుల మంజూరుకు సత్వర చర్యలు తీసుకోవాలని, పరిశ్రమల ఏర్పాటుతో స్థానికంగా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని ఇంచార్జి జిల్లా కలెక్టర్ సి.విష్ణు చరణ్ పేర్కొన్నారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో 66వ జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డిస్టిక్ ఇండస్ట్రీస్ మరియు ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ) సమావేశాన్ని ఇంచార్జి జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల ప్రోత్సాహానికి ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు సకాలంలో సింగల్ డెస్క్ పోర్టల్ ద్వారా అన్ని రకాల అనుమతులను అందజేసి పరిశ్రమలు నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలని, లక్ష్య సాధనకు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని జిల్లా పరిశ్రమల అధికారిని ఆదేశించారు. సింగిల్ విండో పోర్టల్ లో పారిశ్రామికవేత్తలు దరఖాస్తు చేసుకున్న అనుమతులను నిర్ణీత సమయంలో ఆమోదించాలని అధికారులను ఆదేశించారు. 2025 నవంబర్‌లో జరిగిన భాగస్వామ్య సదస్సులోని ఇందన, పర్యాటక, ఆహార సంభందిత విభాగాలలో జిల్లాలో ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకున్న భారీ పరిశ్రమల మీద, వివిధ నిర్మాణ దశలలో వున్న భారీ పరిశ్రమల మీద సమీక్షా సమావేశం నిర్వహించి, ఈ పరిశ్రమలు త్వరితగతిన ఉత్పత్తిని ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పరిశ్రమల స్థాపనకు ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి విరివిగా రుణాలు మంజూరు చేపించాలని ఎల్డిఎంని ఆదేశించారు. ఎఎస్ఎంఈ పార్కుల పనులలో పురోగతి ఉండాలని సూచించారు. జిల్లాలో పెద్ద, మెగా ప్రాజెక్టులైన సోలార్, విండ్ తదితర ప్రాజెక్టులకు సంబంధించి ఎప్పటికప్పుడు నివేదిక అందజేయాలని, ప్రాధాన్యత ప్రకారం భూ సేకరణ, భూ బదలాయింపు చేపట్టాలన్నారు. ఏపిఐఐసి పారిశ్రామికవాడలలో ఇంకా ఉత్పత్తి ప్రారంభించని యూనిట్లను వెంటనే ఉత్పత్తి ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని జెడ్ఎం ఏపిఐఐసిని ఆదేశించారు. ఈఓడిబి కింద వివిధ పరిశ్రమల స్థాపనకు అనుమతుల కోసం ఈనెల 1,217 దరఖాస్తులు అందగా, సింగల్ డెస్క్ విధానం ద్వారా 1,185 పరిశ్రమల కు అనుమతులు మంజూరు చేశారని తెలిపారు. పెండింగ్‌లో వున్న కాలుష్య నియంత్రణ మండలిలోని 22 దరఖాస్తులను మరియు తూనికలు, కొలతల శాఖలో వున్న 7 దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. పిఎంఈజిపి పథకం ద్వారా అర్హులైన వారి నుండి నాణ్యతగల పథకాలను ఎంపికచేయాలని పరిశ్రమల అధికారిని ఆదేశించారు. విరివిగా రుణాలు మంజూరు చేపించాలని ఎల్డిఎంని ఆదేశించారు.హార్టికల్చర్, పర్యాటక శాఖకి సంబంధించిన ప్రాజెక్టుల ఎంఓయులు వాటి పురోగతిపై, ఎనర్జీ ప్రాజెక్ట్స్, నెడ్ క్యాప్ సంప్రదాయేతర విద్యుత్ ప్రాజెక్టులపై యూనిట్లు స్థాపనకు ముందుకు వచ్చిన వారికి సహకారం, ఫాలో అప్ ఉండాలని, వేగవంతం చేయాల న్నారు. ర్యాంప్, ఉద్యమ్ వర్క్ షాప్ తదితర అంశాలను పరిశ్రమల శాఖ అధికారులు వివరించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వివరిస్తూ రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ కర్నూలు, నంద్యాల, అనంతపురము, సత్యసాయి జిల్లా నాలుగు జిల్లాలకు సంబంధించిన ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు స్టార్ట్ అప్ కంపెనీలకు టెక్నాలజీ, శిక్షణ, మార్గదర్శనం, ఋణ సదుపాయాలపై సహకారం అందిస్తున్నామని తెలిపారు. హార్టికల్చర్ కి సంబంధించి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు 2.64 ఎకరాల అంశం పురోగతి ఉండాలని సూచించారు. లక్ష్యాల మేరకు అందిపుచ్చుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి శ్రీనివాస యాదవ్, ఏపీఐఏసి జెడ్ఎం నాగకుమార్, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్, లేబర్ డిసి లక్ష్మీ నరసయ్య, కమర్షియల్ ట్యాక్స్ ఏసిటీవో కృష్ణారెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రవి, డిపిఓ నాగరాజు నాయుడు, ఎంవిఐ మనోహర్ రెడ్డి, ఏపీఎస్ఎఫ్సి బ్రాంచ్ మేనేజర్ అన్సారి హుస్సేన్, ఫ్యాక్టరీస్ చీఫ్ ఇన్స్పెక్టర్ రాధాకృష్ణ, ఏపీపీసీబీ ఈఈ శశికళ, కెనరా బ్యాంక్ అసిస్టెంట్ ఎల్డిఎం హేమలత, అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ లింగమయ్య, మైన్స్ డిడి ఆదినారాయణ, ప్యాప్సీ ప్రతినిధి రంగారెడ్డి, ఫ్యాఫ్సియ ప్రతినిధి నాగరాజు, డిక్కీ ప్రతినిధి సి.వెంకటేశులు, డిఐఎ ప్రతినిధి రాజశేఖర్, హార్టికల్చర్ డిడి ఉమాదేవి, డిఆర్డిఏ పిడి శైలజ, జిల్లా టూరిజం అధికారి జయకుమార్ బాబు, మెప్మా పీడీ విశ్వజ్యోతి, లేబర్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీకాంత్ నాయక్, అహుడ ప్లానింగ్ అధికారి ఇషాక్, డిఎస్డివో ప్రతాపరెడ్డి, నెడ్ క్యాప్ ప్రతినిధి కిషోర్ కుమార్ రెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## డ్రిప్ సాగుతో నీటి పొదుపు

### - రైతులకు భారీ రాయితీలు
### - రాష్ట్ర మైక్రో ఇరిగేషన్ ఓఎస్డీ రమేష్





**తొండూరు - సూర్య వాస్తవం:** డ్రిప్ విధానం ద్వారా సాగును ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని రాష్ట్ర మైక్రో ఇరిగేషన్ ఓఎస్డీ రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం మండల పరిధిలోని మాదూరు గ్రామంలో రైతులకు డ్రిప్ సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన రైతులకు 100 శాతం రాయితీ, ఇతర వర్గాల రైతులకు 90 శాతం రాయితీతో డ్రిప్ పరికరాలు అందించనున్నట్లు తెలిపారు. డ్రిప్ సాగు ద్వారా నీటి వినియోగం తగ్గడంతో పాటు పంట దిగుబడి పెరుగు తుందని వివరించారు. అలాగే ఆధునిక సాగు పద్ధతులను రైతులు వినియోగించుకోవాలని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటేష్ రెడ్డి, మైక్రో ఇరిగేషన్ ఎంఐ ఇంజనీర్ శ్రీనివాసులు, ఎంఐఏఓ యేసునాథరెడ్డి, కంపెనీ ప్రతినిధులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

## ఖాతాదారుల శ్రేయస్సే ప్రధాన లక్ష్యం

### - ఆకట్టుకున్న కళాజాత





**వేముల- సూర్య వాస్తవం :** వేముల మండలం ఎద్దులయేని గ్రామంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కళాజాత ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఫీల్డ్ ఆఫీసర్ కిషోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఖాతాదారుల శ్రేయస్సే ప్రధాన లక్ష్యంగా ఏపీజీబీ కృషి చేస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలను ఖాతాదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏటీఎం నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ సేవల గురించి వివరించారు, ఇన్సూరెన్స్ కిమ్స్ గురించి ఆయన ఖాతాదారులకు విశదీకరించారు. కార్యక్రమంలో ఆర్పి రాణి, కళాకారులు వెంకటేశ్వర్లు, రాజు, చిన్ని రాఘవ, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.




## జాతిపిత త్యాగాన్ని అందరూ స్మరించుకోవాలి

### - జనసేన పార్టీ నేత దాసరి రవిశంకర్

**వేంపల్లె - సూర్య వాస్తవం :** జాతిపిత మహాత్మా గాంధీ త్యాగాన్ని మనమందరం స్మరించుకోవాలని పులివెందుల నియోజకవర్గ జనసేన పార్టీ నేత డా.దాసరి రవిశంకర్ అన్నారు. శుక్రవారం స్థానిక పట్టణంలోని ఆయన కార్యాలయంలో మహాత్మా గాంధీ చిత్ర పటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ వర్ధంతి ప్రతి సంవత్సరం జనవరి 30న నిర్వహిస్తారని చెప్పారు. సత్యం, అహింస ఆదర్శాలను పాటించే గాంధీతో పాటు స్వాతంత్రం కోసం ప్రాణాలు అర్పించిన వారందరినీ స్మరించుకోవడం మన బాధ్యత అన్నారు. అమర వీరుల దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకొని ప్రతి ఒక్కరూ అహింస వాదంతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. బ్రిటిష్ పాలకుల చెరనుండి అఖండ భారతావనికి విముక్తిని కలిగించిన మహాత్మ గాంధీతో పాటు అనేకమంది స్వాతంత్ర సమరయోధులు దేశంలో ఉన్నారని చెప్పారు. మహానేత జాతిపిత మోహన్ చంద్ కరంచంద్ గాంధీ ఆశ యాలను కొనసాగించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ యువ నాయకులు గోసల ఆంజనేయులు, నాగ మల్లికార్జున, ఓబుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సీట్ బెల్ట్, హెల్మెట్ భారం కాదు....
# ప్రాణానికి భరోసా..!

- రోడ్డు భద్రత జీవన సూత్రంగా అలవర్చుకోండి
- రోడ్డు భద్రతపై వినూత్నంగా అవగాహన
- క్లాక్‌టవర్ సెంటర్‌లో ఫ్లాష్ మాబ్‌తో ప్రజల్లో చైతన్యం
- డిస్కవర్ అనంతపురం అనిల్ ఆధ్వర్యంలో చైతన్య స్కూలు విద్యార్థినులు ఉత్సాహభరితమైన డ్యాన్స్ ప్రదర్శన




**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం:** జిల్లా ఎస్పీ జగదీష్ నేతృత్వంలో రోడ్డు భద్రతపై సందేశం ప్రజల గుండెల్లోకి చేరేలా ఈ కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన రోడ్డు సేఫ్టీ మిషన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నాడు జిల్లా ఎస్పీ జగదీష్ నేతృత్వంలో అనంతపురం క్లాక్ టవర్ సెంటర్ వద్ద ఆకట్టుకునే విధంగా ఫ్లాష్‌మాబ్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రత నిబంధనలు పాటించాల్సిన అవసరాన్ని ప్రజలకు పాట, నృత్య రూపంలో సులభంగా అర్థమయ్యేలా వివరించారు. రోడ్డు ప్రమాదాలకు చెక్ పెట్టాలనే లక్ష్యంతో రూపొందించిన "ఓ అక్క జాగ్రత్త... ఓ అన్న జాగ్రత్త" అనే ప్రత్యేక గీతానికి, డిస్కవర్ అనంతపురం అనిల్ ఆధ్వర్యంలో చైతన్య స్కూలు విద్యార్థినులు ఉత్సాహభరితమైన డ్యాన్స్ ప్రదర్శన ఇచ్చి ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నారు. ఫ్లాష్‌మాబ్ ను వీక్షించిన ప్రజలు ఆసక్తిగా నిలబడి కార్యక్రమాన్ని తిలకించగా, రోడ్డు భద్రతపై సందేశం నేరుగా ప్రజల గుండెల్లోకి చేరేలా ఈ కార్యక్రమం కొనసాగింది. హెల్మెట్ వినియోగం, సీట్‌బెల్ట్ తప్పనిసరి, మద్యం సేవించి వాహనాలు నడపొద్దు, అతివేగం నివారణ, ట్రాఫిక్ నిబంధనల పాటింపు వంటి అంశాలు పాట రూపంలో ప్రజల్లో అవగాహన కలిగించాయి. ఇంటి నుండీ బయటికి ద్విచక్ర వాహనంపై వెళ్లే సమయంలో ఆ ఇల్లాలు హెల్మెట్ ధరించమని బ్రతిమిలాడినా పెడచెవిన పెట్టి హెల్మెట్ ధరించకుండా వెళ్లిన కొద్ది సమయంలోనే రోడ్డు ప్రమాదంలో ఆ ఇంటి యజమాని మృత్యువాత పడటం... మరో ఇద్దరి చావుకు కారణమైనట్లు పాటలో ప్రదర్శించిన తీరు అక్కడున్న వారిని ఆలోచింపజేసింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ.... రోడ్డు ప్రమాదాలు ఒక్క క్షణంలో ఒక కుటుంబాన్ని అంధకారంలోకి నెట్టే స్థాయి. ప్రాణాలు పోయిన తర్వాత పశ్చాత్తాపం పనికిరాదు. ప్రమాదం జరగకముందే జాగ్రత్త అవసరం" అని అన్నారు. ప్రతిరోజూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, హెల్మెట్ మరియు సీట్‌బెల్ట్ వినియోగం లేకపోవడం, ట్రాఫిక్ నిబంధనల నిర్లక్ష్యం వంటివే ప్రధాన కారణాలని తెలిపారు.

**చట్టం భయంతో కాకుండా ప్రాణాల విలువ తెలుసుకుని నిబంధనలు పాటించాలి**

చట్టం భయంతో కాకుండా ప్రాణాల విలువ తెలుసుకుని స్వచ్ఛందంగా నిబంధనలు పాటించాలి అని ప్రజలకు సూచించారు. "హెల్మెట్ ధరించడం శిక్ష కాదు... మీ కుటుంబానికి ఇచ్చే భద్రత. సీట్‌బెల్ట్ మీ స్వేచ్ఛను కట్టిపడేసేది కాదు... మీ ప్రాణాలను కాపాడేది" అని స్పష్టంగా వివరించారు. యువత రోడ్డు భద్రతకు ఆదర్శంగా నిలవాలని, ఒక్కరి మార్పు సమాజమంతటిపై ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. ఫ్లాష్ మాబ్ వంటి వినూత్న కార్యక్రమాల ద్వారా సందేశం ప్రజల్లో త్వరగా వ్యాప్తి చెందుతుందని తెలిపారు.

**"ఓ అక్క... ఓ అన్న జాగ్రత్త " పాటగానే కాకుండా జీవన సూత్రంగా అలవర్చుకోండి**

రోడ్డు భద్రత పోలీసుల బాధ్యత మాత్రమే కాదు. తల్లి, తండ్రి, అన్న, అక్క -- ప్రతి ఒక్కరి బాధ్యత. 'ఓ అక్క జాగ్రత్త... ఓ అన్న జాగ్రత్త' అనే ఈ సందేశం పాటగా కాకుండా జీవన సూత్రంగా అలవర్చుకోవాలి" అని ఎస్పీ గారు పిలుపు నిచ్చారు. చివరగా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడే విధంగా బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని కోరారు.ఇదివరకే జరిగిన రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన ఫోర్ వీలర్ ను క్లాక్ టవర్ సెంటర్‌లో ఈసందర్భంగా ప్రదర్శనలో ఉంచి చిన్న నిర్లక్ష్యం ఎంత పెద్ద ఉపద్రవాన్ని సృష్టించి ఇటు ప్రాణ నష్టం... అటు ఆర్థిక నష్టం కలిగి యాక్సిడెంట్స్ తో కుటుంబాలు ఎలా చిన్నాభిన్నమవుతాయో జిల్లా ఎస్పీ ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐ.పి.ఎస్ అధికారి అశ్విని మణిదీప్, అనంతపురం డీఎస్పీ వి. శ్రీనివాసరావు, అనిల్ డిస్కవర్ అనంతపురం, సి.ఐ లు వెంకటేష్ నాయక్, జాకీర్, వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, రాజేంద్రనాథ్ యాదవ్, జగదీష్, ఎస్ఐలు రుష్యేంద్రబాబు, లక్ష్మణరావు, రాంనగర్ చైతన్య పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.








# మానవతా స్వచ్ఛంద సంస్థ సేవలు ప్రశంసనీయం

### - డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి

**వేంపల్లె – సూర్య వాస్తవం:** మానవతా స్వచ్ఛంద సంస్థ వేంపల్లి శాఖ సేవలు బహు ప్రశంసనీయమని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నరెడ్డి తులసి రెడ్డి ప్రశంసించారు. శుక్రవారం మానవతా స్వచ్ఛంద సంస్థ వేంపల్లి శాఖ వారు దివ్యాంగుడైన బ్రహ్మానంద రెడ్డికి ఎలక్ట్రిక్ ట్రై సైకిల్ ఉచితంగా బహుకరించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ నరెడ్డి తులసి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ మానవ సేవయే మాధవసేవ, పరుల సేవచే పరమాత్ముని సేవ అన్న సూక్తులను ఆచరణలో మానవతా స్వచ్ఛంద సంస్థ చూపిస్తుంద న్నారు. నానాటికి మానవత్వం అంతరించిపోతున్న నేటి సమాజంలో మానవత్వం ఇంకా ఉంది అని మానవతా సంస్థ సభ్యులు నిరూపించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సంస్థ వేంపల్లి శాఖ శాశ్వత చైర్మన్ చక్రపాణి రెడ్డి,అధ్యక్షుడు ఆవుల యోగేశ్వర బాబు, సభ్యులు చల్లా బాలాజీ,రామ మోహన్ రెడ్డి,డాక్టర్ రంగయ్య, సుభాష్, ఈశ్వర్, దిలీప్ కుమార్, డాక్టర్ సుబ్రహ్మణ్యం, నాగేశ్వరరావు, బండారు వెంకటేశు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న,తోపి రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, నామా వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి పోటీలలో లయోలా పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ




**పులివెందుల– సూర్య వాస్తవం:** ఈనెల 28వ తేదీ తిరుపతిలో జరిగిన ఐపీఎసీఎం రాష్ట్రస్థాయి పోటీలలో పులివెందుల లయోలా పాల్టిక్నిక్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారని కళాశాల ప్రిన్సిపల్ బ్రిట్టో, వైస్ ప్రిన్సిపల్ ప్రవీణ పేర్కొన్నారు. శుక్రవారం కళాశాలలో రాష్ట్రస్థాయి ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలలో తమ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో రాణించడం గర్వించదగ్గ విషయమన్నారు. ఇందులో టేబుల్ డబుల్స్ టెన్నిస్లో సాల్మన్ రాజ్, నాగమణికంఠలు సౌత్ జోన్ మీట్లో అర్హత సాధించారన్నారు. అలాగే లాంగ్జింప్, ట్రిపుల్ జంప్లలో 2వ, 3వ స్థానాలలో ఎస్.ఎం.అజరుద్దీన్, 1500మీటర్ల పరుగు పందెంలో గంగా ప్రణయ్కుమార్రెడ్డి 3వ స్థానంలోనూ ప్రతిభ చూపారన్నారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ తోపాటు పీడీలు అభినందించారు.

# ఫిబ్రవరి నెలలోపు ఈ క్రాప్ బుకింగ్ తప్పనిసరిగా చేయాలి

### - జేడిఏ శివనారాయణ

**లక్కిరెడ్డిపల్లి – సూర్య వాస్తవం:** రబీలో సాగు చేసిన అన్ని పంటలకు ఫిబ్రవరి నెల ఆఖరిలోపు ఈ క్రాప్ బుకింగ్ తప్పనిసరిగా చేయించాలని జెడిఏ శివనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం లక్కిరెడ్డిపల్లి మండలంలోని రెడ్డివారిపల్లి దండోలపల్లి గ్రామాలలో పర్యటించి వరి పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఈ రబీకి ఏఏ పంటలు సాగు చేశారు ఎన్ని ఎకరాల్లో పంట సాగు చేశారని వ్యవసాయ అధికారులు అడిగారు. లక్కరెడ్డిపల్లి మండలంలో ఈ రబీకి 2100 ఎకరాలలో పంటలు సాగు చేశారని సాగుచేసిన ప్రతి పంటకు 90శాతం ఈక్రాప్ బుకింగ్ చేశామని ఏవో రాజకుమారి జెడిఎ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా జేడీఏ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో వెలిగల్లు ప్రాజెక్టు నీరు ఉన్నాయని ప్రతి రైతు ఏదో ఒక పంట సాగు చేసుకుంటున్నారని రైతులను ఇబ్బందులు పెట్టకుండా సాగు చేస్తున్న ప్రతిపంట ఈ క్రాప్ బుకింగ్ చేయించాల న్నారు. అంతేకాకుండా పంట సాగు చేసిన ప్రతి రైతు నుంచి ఈకేవైసీ చేయించా లన్నారు. సకాలంలో రైతులకు ఎరువులు అందించే విధంగా చూడాలన్నారు. అన్ని ఎరువులు అందుబాటులో ఉన్నాయని రైతులను ఇబ్బంది పెట్టకుండా ఎరువులు విత్తనాలు అందించాలన్నారు. ఎరువుల దుకాణాలలో అక్రమాలు జరగకుండా నకిలీ ఎరువులు విక్రయించకుండా తగు చర్యలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులకు అందుబాటులో ఉండి పంట సాగు విధానము సలహాలు సూచనలు రైతులకు అందించాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది అసిస్టెంట్ అగ్రికల్చర్ అధికారులు పాల్గొన్నారు.



# దేశభక్త జైభారత్ సంస్థ సేవలు ప్రశంసనీయం

### - జైభారత్ సంస్థ ఆధ్వర్యంలో జాతీయ సమైక్యతా ర్యాలీ
### - పులివెందుల అర్బన్ సీఐ సీతారామిరెడ్డి






**పులివెందుల– సూర్య వాస్తవం :** భారతదేశ సార్వభౌమాధికారాన్ని, సమగ్రతను పరిరక్షించేందుకు జాతీయసమైక్యత, మతసామ రస్యం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, విశ్వమానవ సోదరభావం పెంపొందించేందుకు దేశవ్యాప్తంగా అహర్నిశలు శ్రమిస్తున్న జైభారత్ స్వచ్చందసంస్థ సేవలు ప్రశంసనీయమని, హిందూ – ముస్లిం సమైక్యత కొరకు సంస్థ చేపట్టిన కార్యక్రమాలు దేశ లౌకిక వాదాన్ని పటిష్టపరిచే విధంగా, దేశఔన్నత్యాన్ని చాటే విధంగా ఉన్నాయని, మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా, అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని, దివ్యాంగులతో సమైక్యతార్యాలీ నిర్వహించి, వారికి చేయూతనందించడం అభినందనీ యమని, జైభారత్ సంస్థ రాష్ట్రఅధ్యక్షులు విశ్వధర్మ ఓబులేసు సేవలు అమూల్యమైనవని పులివెందుల అర్బన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సీతారామిరెడ్డి పేర్కొన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ 78వ వర్ధంతిని పురస్కరించుకొని, జైభారత్ సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ముద్దనూరు రోడ్డులోని వికలాంగుల కమ్యూనిటీ భవనం నుండి దివ్యాంగులు, స్వచ్ఛంద సేవకులు సమైక్యతా ప్రదర్శన నిర్వహించి, పూలంగళ్ళ సర్కిల్లో దేశ ఐక్యత కోసం ప్రాణాలర్పించిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ, జాతీయ సమైక్యతా ప్రతిజ్ఞ నిర్వహించారు. అనంతరం నినాదాలు చేస్తూ, నాలుగు రోడ్ల కూడలిలోని గాంధీ సర్కిల్లో మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలవేసి ఘననివాళులు అర్పించి, భారతదేశ అఖండత, సమగ్రతకు పాటుపడతామని ప్రతిన పూనారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అర్బన్ సీఐ సీతారామిరెడ్డి చేతుల మీదుగా జై భారత్ సంస్థ సభ్యులు దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం స్వీట్లు, పండ్లు అందించారు. ఈకార్యక్రమంలో వికలాంగుల నెట్ వర్క్ రాష్ట్రఅధ్యక్షులు డాక్టర్ ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, కార్యదర్శి సునీల్, జై భారత్ సంస్థ రాష్ట్ర అధ్యక్షులు బ్రాహ్మణ పల్లె విశ్వధర్మ ఓబులేసు, కార్యవర్గ సభ్యులు మహబూబ్ బాషా, భరత్, షేక్ వలి, సూర్యసేన్, గంగరాజు, శివయ్య, మైత్రేయి తదితరులు పాల్గొన్నారు.

# హనుమద్వాహనంపై శ్రీవేంకటరమణుడు

### - శ్రీవారి కల్యాణం కమనీయం



**పులివెందుల– సూర్య వాస్తవం:** శ్రీవేంకట రమణుడు ఆలయంలో గత వారం రోజు లుగా జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం శ్రీవేంకటరమణుడు పగలు హనుమద్వాహనం, రాత్రి గజ వాహనాలపై కొలువుతీరి భక్తులు దర్శనమి చ్చారు. భక్తులు గోవింద నామస్మరణలతో దేవదేవుని ఆరాదించారు. స్వామివారు తమ ఇంటి ముంగిటకు రాగానే గోవిందా అంటూ భక్తిపారవశ్యంతో పూజా ద్రవ్యాలు,కాయ కర్పూరాలు సమర్పించి వేడుకున్నారు. సాయంత్రం గజవాహనంపై పురవీధులలో స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. పట్టణ పురవీధులైన పూలంగళ్ల సర్కిల్, మెయిన్ బజార్, ముత్యాలవారివీధి, గాడిచర్లవీధి. అమ్మవారిశాల వీధుల మీదుగా భక్తులకు దర్శనమిచ్చి కనువిందు చేశారు. ముందుగా ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ. తోమాలసేవ. సహస్రనామార్చాన నివేదన, నిత్య హోమం. కలశారాధన, పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం వేంకట రమణుడి కళ్యాణం కమనీయంగా శాస్త్రయుక్తంగా నిర్వహించారు.

# ఘనంగా గ్రంథాలయ చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవం

### - పాల్గొన్న ఎమ్మెల్యే శ్యాంబాబు, డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్




**కర్నూల్ – సూర్య వాస్తవం:** కర్నూల్ నగరంలో గ్రంథాలయ చైర్మన్‌గా తుగ్గిలి నాగేంద్ర ప్రమాణ స్వీకారోత్సవానికి వారి పిలుపుమేరకు ముఖ్య అతిధులుగా పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాం బాబు, డిసిఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రమాణ స్వీకారానికి వచ్చి తుగ్గలి నాగేంద్రకి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే ఈ పదవిని తుగ్గలి నాగేంద్రకి ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ఎమ్మెల్యే కేఈ శ్యాం బాబు సభాముఖంగా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యలను విస్మరిస్తున్న ప్రభుత్వం

**- ఎస్టియు కడప జిల్లా శాఖ అధ్యక్షుడు సంగమేశ్వర్ రెడ్డి**




**వేంపల్లె - సూర్య వాస్తవం:** ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఉద్యోగుల ద్వారా ఎన్నికల్లో రాజకీయ లబ్ది పొంది వారి ప్రయోజనాల విషయంలో, మేనిఫెస్టో పరంగా ఆర్థిక సమస్యల పరిష్కారం విషయంలో నిర్లక్ష్యం వహిస్తోందని జిల్లా అధ్యక్షుడు పేర్కొన్నారు. ఎస్టియు రాష్ట్ర సంఘం పిలుపుమేరకు కడప జిల్లా వ్యాప్తంగా 40 మండలాల్లో ఎస్‌టియు శ్రేణులు మొదటి దశ ఉద్యమంలో భాగంగా మండల తహశీల్దార్‌కి నిరసన వినతి పత్రాన్ని అందించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయుల ఆర్థికపరమైన సమస్యల పరిష్కారానికి ఎస్టియు రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపుమేరకు మూడు దశల ఉద్యమంలో భాగంగా మొదటి దశలో మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసించి నిరసన వినతి పత్రాన్ని తహశీల్దార్‌కి అందించారు. అందులో భాగంగా వేంపల్లి మండల తహసిల్దార్ కార్యాలయం వద్ద ఎస్టియు జిల్లా అధ్యక్షుడు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించిన సందర్భంగా వారు మాట్లాడుతూ 2024 ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీలను 18 నెలలుగా విస్మరించిందని 12వ వేతన సవరణకై ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని. 12వ వేతన సవరణ అమలు లో తీవ్ర జాప్యం జరుగుతుందని ఇప్పటికే 30 నెలల ఆర్థిక ప్రయోజనాన్ని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల నష్టపోయారని గత ప్రభుత్వం నియమించిన పిఆర్‌సి కమిషన్‌ను ఈ కూటమి ప్రభుత్వం బలవంతంగా రాజీనామా చేయించారని తర్వాత కొత్త కమిషన్ నియమించలేదని మధ్యంతర భృతి ప్రకటించలేదని, ఆర్థిక బకాయలు కొండంత ఉంటే గోరంత ఇచ్చి గొప్పలు చెప్పు కుంటున్నారని, సిపిఎస్ రద్దు చేస్తామని నూతన విధానాన్ని ప్రకటిస్తామని చెప్పినప్పటికీ దానిపై ఎటువంటి కార్యాచరణ కనపడలేదని, మెమో నెంబర్ 57 ఆధారంగా 2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ వర్తింపజేసే హామీని కూడా తుంగలో తొక్కారని, ఇప్పటికీ నాలుగు డి.ఏలు ప్రకటించాల్సి ఉందని ఒకవైపు ధరలు పెరుగుదల ఆకాశమే హద్దుగా ఉండగా ప్రైస్ ఇండెక్స్ ఆధారంగా ఉద్యోగులకు పెంచాల్సిన డిఏ విషయంలో మాత్రం ఎదురుచూపులే మిగులుతున్నాయని ఇప్పటికే డి ఏ బకాయిలు 11వ పిఆర్సి బకాయలు ఒక్కొక్క ఉపాధ్యాయుడికి రెండు లక్షల నుంచి మూడు లక్షలు పైగా బకాయిలుగా ఉన్నాయని మరణించిన ఉపాధ్యాయులకు డెత్ గ్రాట్యుటీ చెల్లించలేదని పదవి విరమణ చెందిన ఉపాధ్యాయులకు గత 18 నెలలుగా గ్రాట్యూటీ చెల్లించడం లేదని, చనిపోయిన ఉపాధ్యాయుల పిల్లలకు కారుణ్య నియామకాల విషయంలో నిబంధ నలంటూ మోకాలు అడుగుతున్నారని దాదాపు రాష్ట్ర వ్యాప్తంగా 500 మంది కారుణ్య నియామకాల కోసం ఎదురు చూస్తున్నారని చనిపోయిన ఉద్యోగ ఉపాధ్యాయుల మట్టి ఖర్చులకోసం విడుదల చేయవలసిన 25 వేల రూపాయలు కూడా విడుదల కాక 18 నెలలవుతుందని 2022 లోను, 2024 లోను ఉపాధ్యాయులు సరెండర్ చేసిన సంపాదిత సెలవులు సంబంధించి బిల్లులు ఇంతవరకు చెల్లించలేదని ఇలా ఆర్థిక సమస్యలు ఉపాధ్యాయులను వేధిస్తుంటే ప్రశాంతంగా ఏ విధంగా విధి నిర్వహణ జరుగుతుందని ఎన్నికల్లో ఉపాధ్యాయులు కూటమి ప్రభుత్వం మంచి చేస్తుందని ఎదురుచూసినప్పటికీ నిరాశే ఎదురవుతోందని ఇది మంచి విధానం కాదని తక్షణం 12వ పిఆర్సి కమిషన్ను నియమించి ఇంటీరియర్ రిలీఫ్ ప్రకటించాలని పెండింగ్ బకాయిల చెల్లింపుకు రోడ్ మ్యాప్ ప్రకటించాలని సిపిఎస్ రద్దు ప్రకటన చేయాలని మేము 57 ఆధారంగా 2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ వర్తింపజేయాలని సంపాదిత సెలవుల బిల్లులను చెల్లించాలని ధరల పెరుగుదల ఆధారంగా డి.ఎ లను ప్రకటించా లని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు ప్రభుత్వం ఇలాగే నిర్లక్ష్యం వహిస్తే ఉద్యమ వాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చ రించారు. ఈ నిరసన కార్య క్రమంలో రీజియన్ కన్వీనర్ ప్రతాపరెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు డిసి గోవిందు, ప్రధాన కార్యదర్శి భాస్కర్ రెడ్డి, నాయకులు లక్ష్మీ నరసింహ, జనార్ధన్ రెడ్డి, మహబూబ్ బాషా, ధర్మారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి. వేంపల్లి మండల వ్యాప్తంగా దాదాపు 50 మంది ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, ఎస్టియు కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## రెవెన్యూ క్లినిక్"లో 210 ఫిర్యాదులు

**-స్పాట్‌లో 45 ఫిర్యాదులకు పరిష్కారం**

**- తహశీల్దార్ కార్తీక్ వెల్లడి**



**బ్రహ్మంగారిమఠం - సూర్యవాస్తవం:** మండల పరిధిలోని సమస్యలను పరిష్కరించడానికై రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా "రెవిన్యూ క్లినిక్"ల పేరుతో మండల కేంద్రంలో సమావేశం ఏర్పాటు చేసి, అందులో మండల పరిధిలోని భూ సమస్యలపై కొన్నింటికి తక్షణ పరిష్కార మార్గం చూపడం జరిగిందని బి.మఠం మండల తహశీల్దార్ కార్తీక్ తెలిపారు. ఈ రెవెన్యూ క్లినిక్ లో 210 సమస్యలపై రైతుల నుండి ఫిర్యాదులు వచ్చాయని, అందులో 45 ఫిర్యాదులను ఆ రోజే పరిష్కార మార్గం చూపామని తాసిల్దార్ కార్తీక్ తెలియజేశారు. మిగిలిన వాటిని కూడా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కొన్ని సమస్యలు మాత్రం అనగా డీకేటీ భూములు, కొందరు రైతులు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని వాటికి డి.పట్టాలు ఇవ్వమని అడగడం వంటి ఫిర్యాదులను మాత్రం ప్రస్తుతం పరిష్కరించలేమన్నారు. అలాంటి సమస్యలను స్థానిక ఎమ్మెల్యే సూచనలతో పరిష్కారం చేస్తామని ఆయన తెలియజేశారు.

## శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మాస కల్యాణంలో మఠాధిపతి శ్రీ వెంకటాద్రి స్వామి దంపతులు



**బ్రహ్మంగారిమఠం- సూర్య వాస్తవం:** జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మఠంలో ప్రతి నెలా జరుగు శ్రీ గోవింద మాంబా సమేత శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మాస కల్యాణం దేవస్థాన మఠాధిపతులు శ్రీ వెంకటాద్రి స్వామి ఆయన ధర్మపత్ని ఉమాదేవి పాల్గొని పూజలు నిర్వహించి స్వామివారికి కళ్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మఠం మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి ఉన్నారు. కళ్యాణం ఉభయ దాతలు, భక్తులు, మఠం సిబ్బంది ఉన్నారు.



## మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

**- పథకాన్ని స్వచ్ఛంద సంస్థలకు అప్పగిస్తే పోరాటం తప్పదు : సీఐటీయూ**

**నాయుడుపేట - సూర్య వాస్తవం:** మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులకు వెంటనే ఉద్యోగ భద్రత కల్పించాలని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం రాష్ట్ర నాయకురాలు కె.విజయమ్మ డిమాండ్ చేశారు. శుక్రవారం నాయుడుపేట పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన మధ్యాహ్న భోజన కార్మికుల సంఘ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను నాయకులు, అధికారులు పట్టించుకోవడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సలహాలు, సూచనలు తీసుకోకుండానే మధ్యాహ్న భోజన పథకాన్ని స్వచ్ఛంద సంస్థలకు అప్పగించేందుకు ప్రయత్నించడం అన్యాయమని అన్నారు. ఈ పథకాన్ని స్వచ్ఛంద సంస్థలకు అప్పగిస్తే తీవ్ర పోరాటాల ద్వారా అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు శివకవి ముకుందా మాట్లాడుతూ, మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రతినెలా బిల్లులు సకాలంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. పథకాన్ని స్వచ్ఛంద సంస్థలకు అప్పగించే ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని, లేకుంటే కార్మిక ఉద్యమాలు ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం సభ్యులు సుగుణమ్మ, కె. వాణి, భారతి, వెంకటేశ్వర్లు, రజియా, పెంచలయ్య, మణి, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఎంపీ అవినాష్ రెడ్డి ప్రత్యేక పూజలు



**పులివెందుల - సూర్య వాస్తవం:** పులివెందుల పట్టణ పరిధిలో కొలువై ఉన్న శ్రీ పద్మావతి వెంకటరమణ స్వామి ఆలయంలో మాఘ మాసాన్ని పురస్కరించుకొని వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో శుక్రవారం జిల్లా ఎంపీ అవినాష్ రెడ్డి పులివెందుల మున్సిపల్ ఇంచార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి, వేల్పుల రాము లు వేద పండితులచే దేవదేవుడి ఆశీస్సులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా జిల్లా ఎంపీ అవినాష్ రెడ్డి ని ఆలయ నిర్వాహకులు ఘనస్వాగతం పలికి దుశాల్వా గజమాలతో సత్కరించి విశేష పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు అందించారు. ఈ సందర్భంగా ఎంపీ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ మాఘ మాసంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలలో పాల్గొని స్వామి వారి దీవెనలు అందుకోవడం సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. రానున్న రోజుల్లో శ్రీ వెంకటేశ్వర స్వామి అనుగ్రహంతో జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి అయ్యి రాష్ట్ర ప్రజలకు సేవలు అందించే విధంగా దేవదేవుడు ఆశీర్వదించాలని కోరుకుంటు న్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, పులివెందుల పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్, కో ఆప్షన్ చంద్రమౌళి, వైసిపి నాయకులు రవి, చంద్రమౌళి, శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్వాహకులు కమిటీ సభ్యులు, వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవు



**గుత్తి - సూర్య వాస్తవం:** గుత్తి అనంతపూర్ జిల్లా ఎస్పీ ఆదే శాల మేరకు గుంతకల్ డీఎస్పీ ఆధ్వర్యంలో గుత్తి మండలం తొండపాడు గ్రామంలో జరుగు బొలికొండ రంగ నాథస్వామి రథోత్సవ మహోత్సవం సంబంధించిన ఏర్పాట్లను సిఐ మరి యు ఎస్ఐలతో పాటు పరిశీలించారు. పోలీసు వారు పత్రిక వారి ద్వారా ప్రజలకు తెలియజేయడమేమనగా 1.రథోత్సవంకు టు వీలర్‌లో వచ్చే ప్రతివారు హెల్మెట్ ధరించవలెను. 2.గూడ్స్ వెహికల్ లో భక్తాదులు ప్రయాణించరాదు. 3.ఎ ద్దుల బండిలో రాత్రిపూట తొండపా డుకు వచ్చేవారు రేడియం స్టిక్కర్లు అతికించుకోవలెను 4.ఎవరైనా అ సాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయి. 5.కార్లో వచ్చేవారు ప్రతి ఒ క్కరు సీటు బెల్టు ధరించవలెను. 6. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించవలెను.

## కుష్ఠు వ్యాధిపై ప్రజలకు అవగాహన




**పామిడి- సూర్యవాస్తం:** పామిడి మండలం గజరాంపల్లి సచివాలయం నందు కుష్ఠు వ్యాధి గురించి అవగాహన కార్యాక్రమం జరిగింది. అందులో భాగంగా కుష్ఠు వ్యాధి అంటే ఏమిటీ ఎలా వస్తుంది, ఎలా నివారించవచ్చు తీసుకోవలసిన జాగ్రత్తలు మరియు వాటి లక్షణాలు గురించి చెప్పడం జరిగింది. మన దేశాన్ని కుష్ఠు వ్యాధి రహితంగా లేకుండా చేస్తామని ప్రజలందరి చేత ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలోఏఎన్ఎం నాగమునేశ్వరి ఎంఎల్‌హెచ్‌పి సరస్వతి అంగన్‌వాడీ టీచర్ స్వప్న, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## మహాత్మా గాంధీ సందేశ్ యాత్రకు సంఘీభావం తెలిపిన వేలూరు శ్రీనివాస్ రెడ్డి



**పులివెందుల - సూర్య వాస్తవం:** మాజీ మంత్రివర్యులు డాక్టర్ ఎన్ రఘువీరారెడ్డి చేపట్టిన మహాత్మా గాంధీ సందేశ్ పాదయాత్రకు పీసీసీ డెలిగేట్ వేలూరుశ్రీనివాస్ రెడ్డి సంఘీభావం ప్రకటించారు. శుక్రవారం ఆయన హిందూపురం వద్ద కొన సాగుతున్న మహాత్మా గాంధీ సందేశ్ యాత్రలో డాక్టర్ రఘువీరా రెడ్డిని శాలువాతో సత్కరించారు. భగవంతుడి ఆశీస్సులతో ఈ సందేశ్ యాత్ర విజయవంతంగా పూర్తీకావాలని ఆకాంక్షించారు. సిడబ్ల్యూసి మెంబర్ గిడుగు రుద్రరాజు శాలువాతో సత్కరించి ప్రస్తుత పులివెందుల రాజకీయాల మీద చర్చించారు.

## కోటంక గ్రామంలో పారిశుధ్య పనుల తనిఖీ

**- రెండు రోజుల్లో ఇంటి గుత్తలను పూర్తి చేయాలని ఆదేశం..**



**గార్లదిన్నె - సూర్య వాస్తవం:** గార్లదిన్నె మండలంలోని కోటంక గ్రామంలో అనంతపురం డివిజనల్ పంచాయతీశాఖ అధికారి విజయ్ కుమార్ రెడ్డి శుక్రవారం పర్యటించారు. గ్రామంలో జరుగుతున్న ఇంటింటి చెత్త సేకరణ పనులను పరిశీలించారు. గ్రామంలో ఉన్న ఇంటి గుత్తలను రెండు రోజుల్లో పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ప్రతిరోజూ చెత్త సేకరణ నిర్వహించాలని, పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహించరాదని ఆదేశించడమైంది. అలాగే గ్రామ పంచాయతీలకు ఆదాయం పెంచేలా చెత్త నుండి సంపద కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. తడి--పొడి చెత్తను వేరు చేసి కంపోస్ట్, రీసైక్లింగ్ ద్వారా ఆదాయం సమకూర్చాలని సూచించారు. గ్రామ పరిశుభ్రత, ప్రజారోగ్య పరిరక్షణకు ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

## మహాత్మా గాంధీ వర్ధంతి వేడుకలు

**వేంపల్లె - సూర్య వాస్తవం :** ఆర్యవైశ్య అఫీసియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మా గాంధీ 78వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేంపల్లె అవోపా అధ్యక్షులు బైరిశెట్టి వెంకటసునీల్ మాట్లాడుతూ శుక్రవారం మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా వేంపల్లెలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థాన కార్యాలయంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించామన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గాంధీజీ స్ఫూర్తితో అహింసా మార్గంలో దేశాన్ని ముందుకు నడిపిద్దామని పిలుపునిచ్చారు. అలాగే ఆయన దేశానికి చేసిన త్యాగాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అవోపా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



## కో-వర్కింగ్ స్పేస్ సెంటర్‌ను ప్రారంభించిన ముఖ్యమంత్రి

### - నవదిశ కేంద్రం పేరిట కో-వర్కింగ్ స్పేస్ సెంటర్ ఏర్పాటు

**కుప్పం -సూర్య వాస్తవం:** హిందాల్కో-ఆదిత్య బిర్లా గ్రూప్-కుప్పం ఏరియా డెవలప్మెంట్ అథార్టీ భాగస్వామ్యంతో మల్టీ స్కిల్ డెవలప్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఇందులో పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్యాభివృద్ధి లో శిక్షణ ఇస్తున్నారు.మల్టీ స్కిల్ డెవలప్ సెంటర్ ద్వారా 2500 కుటుంబాలు లబ్ధి పొందేందుకు అవకాశం ఉంది.20 వేల మంది యువతకు నైపుణ్యం, సాధికారత లభించేలా మల్టీ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ కృషి చేయనుంది. సీఎం చంద్రబాబు చొరవతో సంబల్ పూర్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ విధానంలో కుప్పంలో మల్టీ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేశారు.స్కిల్ డెవలప్మెంట్, ఇన్నోవేషన్ గేట్ వేగా స్వర్ణ నవదిశ కేంద్రం మారనుంది.హైస్పీడ్ ఇంటర్నెట్, ఏసీ, ప్యాంట్రీ, స్టోరేజ్ వసతులతో 50 మంది పని చేసుకునేలా కో-వర్కింగ్ స్పేస్ సెంటర్ రూపకల్పన చేశారు.అదనంగా 40 మంది చదువుకునేలా లైబ్రరీ, డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేశారు.

.ఆదిత్య బిర్లా మల్టీ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ద్వారా వచ్చే మూడేళ్లల్లో 1000 మంది యువతకు నైపుణ్య శిక్షణ ఇప్పించేలా చర్యలు, 700 మందికి ఉద్యోగాలు కల్పించేలా ప్రణాళికలు రూపొందించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూర్టీ, రోబోటిక్స్, మెకట్రానిక్స్, ఆదిత్య బిర్లా మల్టీ స్కిల్ డెవలప్ సెంటర్ ఫ్యాషన్ టెక్నిషీయన్, ఐటీ ల్యాబ్ తదితర కోర్సుల్లో నైపుణ్య శిక్షణ ఇవ్వనుంది.

## హసన్ దాదా ఉరుసు ఉత్సవాల్లో అన్నదానం




**రాయచోటి - సూర్య వాస్తవం:** పట్టణంలోని బండ్లపెంటలో వెలిసిన హజరత్ హసన్ దాదా ఉరుసు ఉత్సవాల్లో శుక్రవారం గంధం రోజు వివిధ ప్రాంతాల నుంచి మధ్యాహ్నం దర్గాకు వచ్చిన భక్తులందరికీ దర్గా కమిటీ వారు భోజన సదుపాయం ఏర్పాటు చేయడం జరిగిందని కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ షరీఫ్ తెలిపారు. హజ్రత్ హాసన్ దాదా దర్గాకు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులందరికీ అన్ని సౌకర్యాలు కల్పించామని ఆయన చెప్పారు. హిందూ, ముస్లింలు సోదరులందరూ శుక్రవారం గంధం రోజు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ ఉత్సవాల్లో మాజీ మున్సిపల్ కో ఆప్షన్ నెంబర్ హాజీ సలావుద్దీన్ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ షరీఫ్, కమిటీ సభ్యులు నేలపాటి అన్నయ్య కుమారుడు వెంకటేష్, హైదర్ అలీ, ఆబీద్, నిజాం స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## అర్జీదారుల ఆశకు తగ్గ పరిష్కారం ఇవ్వాలి

### - అధికారులకు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆదేశం



**కనేకల్లు - సూర్య వాస్తవం :** కనేకల్లు మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. అర్జీదారుడు ఏ ఆశతో అర్జీ సమర్పించాడో, ఆ ఆశకు తగిన విధంగా పరిష్కారం చూపించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఆయన స్పష్టం చేశారు. కేవలం వచ్చిన అర్జీని మరో అధికా రికి పంపించడం ద్వారా పరిష్కారం చేసినట్టు భావించడం సరైన పద్ధతి కాదన్నారు. అర్జీదారుడు ఆశించిన విధంగా సమస్యను పరిష్కరించినప్పుడే అదినిజమైన, నాణ్యమైన పరిష్కారమవుతుందన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) ద్వారా అర్జీలను సంబంధిత ఉన్నతాధికారులు కూడా పరిశీలించే అవకాశం కల్పించబడిందని తెలిపారు. ప్రతి శాఖకు సంబంధించిన అర్జీలను ఆయా శాఖల అధికారులు బాధ్యతగా పరిశీలించి, వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఇలా చేస్తే ప్రభుత్వంపై ప్రజలకు విశ్వాసం పెరుగుతుందని, ప్రజలు సంతృప్తి చెందుతారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇప్పటివరకు నిర్వహించిన ప్రజా దర్బార్లలో మొత్తం 523 అర్జీలు స్వీకరించగా, అందులో 73 శాతం అర్జీలు పరిష్కరించబడ్డాయని తెలిపారు. ప్రస్తుతం 125 అర్జీలు ప్రోగ్రెస్‌లో ఉండగా, వివిధ కారణాల వల్ల ఏడు అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పిజిఆర్ఎస్ విధానం ద్వారా సమస్యలు వేగంగా పరిష్కారమవుతాయన్న నమ్మకాన్ని ప్రజల్లో కల్పించేలా అధికారులు పని చేయాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఏ. వన్నారెడ్డి, ఉప్పర కార్పొరేషన్ డైరెక్టర్ ఆనంద్, జిల్లా ఉపాధ్యక్షుడు లాలేప్ప, సుదర్శన్, బిటి రమేష్, ఫక్రుద్దీన్, ఎస్.కె. మల్లికార్జున, నాగార్జున, చాంద్ తదితరులు పాల్గొన్నారు.

## 2026- 27వ సంవత్సరానికి అక్రిడిటేషన్ల జారీకి కమిటీ ఆమోదం

### - జిల్లా కలెక్టర్ డీఎంఎసి ఛైర్మన్ శ్రీధర్ చెరుకూరి



**కడప - సూర్య వాస్తవం :** జిల్లాలోని అర్హులైన 569 మంది జర్నలిస్టులకు తొలి విడతలో అక్రిడిటేషన్లు మంజూరు చేస్తూ జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ ఆమోదం తెలిపిందనీ డిఎంఎసి చైర్మన్, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక కలెక్టర్ ఛాంబర్ నందు జిల్లా కలెక్టర్ డీఎంఎసి చైర్మన్ శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... అర్హులైన జర్నలిస్టు లందరికీ నిబంధనల ప్రకారం అక్రిడిటేషన్లు మంజూరు చేయడం జరిగిందని, మొదటి సమావేశంలో 569కి కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. ఇంకనూ అర్హత ఉన్న పాత్రికేయులు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకున్న వారికి మరియు వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి తదుపరి సమావేశంలో అక్రిడిటేషన్లు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు.

# గొప్పగా చదివి సమాజానికి మంచిని పంచండి

### - విద్యార్థినులకు ఎమ్మెల్యే కాలవ ఉద్బోధ



**రాయదుర్గం- సూర్య వాస్తవం :** ఆడపిల్లలు చదువుకుంటే ఆ కుటుంబంతో పాటు ఆప్రాంతం కూడా బాగు పడుతుందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. రాయదుర్గం పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బివిద్యార్థినులకు శుక్రవారం ఆయన సైకిల్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ... చదువు ద్వారానే సంపదతో పాటు సమాజంలో, కుటుంబంలో గౌరవం, శక్తి లభిస్తాయన్నారు. చదువుకునే దశలో చదువే ప్రపంచంగా బతకగలిగితే మీ లక్ష్యాలను అవలీలగా సాధించే శక్తి మీకు వస్తుందని తెలియజేశారు. ముఖ్యంగా బాలికల విద్య సమాజానికి చాలా అవసరం అన్నారు. 2014-19 మధ్యన తాను చదువుల ఒడి పేరుతో అర్ధాంతరంగా పాఠశాలను వదిలేసిన బాలికలను తిరిగి పాఠశాలలో చేర్పించి ప్రోత్సహించడం జరిగిందని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు 75వ జన్మదిన సందర్భంగా 75 మంది తల్లి తండ్రి లేని అనాథ బాలికలను చదివిస్తానని ప్రకటించానన్నారు. స్థానిక పాఠశాలలో ఎవరైనా అలాంటి పిల్లలు ఉంటే గుర్తించి తన దృష్టికి తీసుకువస్తే.. వారి చదువుకు ఇలాంటి ఆటంకాలు లేకుండా పూర్తి బాధ్యత తాను తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. గత తెలుగుదేశం



పార్టీ ప్రభుత్వంలో మంజూరై, నిరుపయోగంగా ఉన్న 40 సైకిళ్లను నేడు పంపిణీ చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. బాలికలు పాఠశాలకు రావడానికి అనువుగా సైకిల్లను టిడిపి ప్రభుత్వం పంపిణీ చేసిందన్నారు. తర్వాత వచ్చిన జగన్ ప్రభుత్వం వాటిని మరుగున పడేసిందని ఆందోళన వ్యక్తపరిచారు. దాంతో ఐదేళ్లపాటు మూలన పడ్డ సైకిల్లకు మరమ్మతులు చేయించి కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో బాలికలకు పంపిణీ చేస్తున్నామని వివరించారు. బాలికల్లో డ్రాప్ అవుట్స్ తగ్గించడానికి ఇవి దోహద పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంట్లో పని ఒత్తిడి కారణంగా తల్లిదండ్రులు కూడా పాఠశాలకు ఎందుకు పోతావులే..! అంత దూరం అని వారిని నిరుత్సాహ పరిచే వాతావరణము ఉంటుందన్నారు. అట్లాంటి పిల్లలకు సైకిల్ ఉంటే వాళ్ళు నేరుగా స్కూలుకు ఆ సైకిల్ పైన వచ్చి వెళ్లే దానికి అవకాశం ఉంటుందన్నారు. ఇది బాలికల విద్యకు ఎంతగానో ఉపయోగపడే మంచి కార్యక్రమం అన్నారు. విద్యతో పాటు ఉద్యోగాల్లోనూ మంచి ఫలితాలు రాబట్టాలన్న బాలికల చదువుకు చాలా ప్రాధాన్యత ఉందన్నారు. కక్షలు, కార్పన్యాలకు దూరంగా ప్రశాంతమైన జీవన విధానాన్ని విద్యార్థి దశ నుండే అలవర్చుకోవాలని సూచించారు. అందరూ బాగుండాలని కోరుకోవడం మంచి సమాజ నిర్మాణానికి దోహదపడుతుందనీ కాలవ హితోపదేశం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణ మూర్తి, కరెన్న, కార్పొరేషన్ డైరెక్టర్ పోరాళ్ల పురుషోత్తం, అగ్రహారం కిరణ్, కెడిమి తిప్పేస్వామి,పైతోట రామంజి, హెచ్. ఆనంద్, వై.వెంకటేశులు, ఆటో వెంకటేశులు,బండి భారతి, బంగి శంకర్,కొండాపురం శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



# 2026- 27 అక్రిడిటేషన్ల జారీకి కమిటీ ఆమోదం

### - జిల్లా కలెక్టర్ డీఎంఎసి ఛైర్మన్ శ్రీధర్ చెరుకూరి



**కడప-సూర్య వాస్తవం:** జిల్లాలోని అర్హులైన 569 మంది జర్నలి స్టులకుతొలి విడతలో అక్రిడిటేషన్లు మంజూరు చేస్తూ జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ ఆమోదం తెలిపిందనీ డిఎంఎసి చైర్మన్, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక కలెక్టర్ ఛాంబర్ నందు జిల్లా కలెక్టర్ డీఎంఎసి చైర్మన్ శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... అర్హులైన జర్నలిస్టు లందరికీ నిబంధనల ప్రకారం అక్రిడిటేషన్లు మంజూరు చేయడం జరిగిందని,మొదటి సమావేశంలో 569కి కమిటీ ఆమోదం తెలిపిందనన్నారు. ఇంకనూ అర్హత ఉన్న పాత్రికేయులు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకున్న వారికి మరియు వివిధ కారణాలతో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి తదుపరి సమావేశం లో అక్రిడిటేషన్లు మంజూరు చేయడం జరుగు తుందని తెలిపా రు.ఈ సమావేశంలో డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, డి ఎం ఏ సి కన్వీనర్ పద్మజ,డి విజనల్ పీఆర్వో సునీల్ సాగర్,ఆర్టీసీ ఆర్ఎం గోపాల్ రెడ్డి, డీఎంహెచ్ నాగరాజు, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ రంగ రాజు, పిడిహౌసింగ్ రాజారత్నం, రైల్వే పీఆర్వోజనార్ధన్, బ్యూరో చీఫ్ విశాలాంధ్ర పి.రామసుబ్బా రెడ్డి,బ్యూరో చీఫ్ ఆంధ్ర జ్యోతి ఈ.ఆంజ నేయలు, స్టాఫ్ రిపోర్టర్ ప్రజాశక్తి నూర్ బాషా,స్టాఫ్ రిపోర్టర్ ఈ టివి జి.మురళి మోహన్ గౌడ్, స్టాఫ్ రిపోర్టర్ హెచ్ యంటివి వి.యం.చంద్ర మోహన్ రాజు,రిపోర్టర్,వార్త ఆర్.మనోహర్,రిపోర్టర్ ఆంధ్రప్రభ ఐ.సి.సు బ్బారెడ్డి,ఎడిటర్ రాయలసీమ సమయం ఏ.సందీప్ కుమార్ రెడ్డి,ఎడిటర్ కొత్త తరంగం కె.రమేష్,స్టాఫ్ రిపోర్టర్ మహా న్యూస్ యు శ్రీకాంత్, కరస్పాండెంట్ ప్రసార్ భారతి బి.శ్రీనాథ్ రెడ్డి, ఫోటోగ్రాఫర్, ఆంధ్ర జ్యోతి టి.రత్నయ్య, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ముగిసిన

# 14వ బెటాలియన్ స్పోర్ట్స్ మీట్...

### - ముఖ్యఅతిథిగా పాల్గొన్న సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ
### - ఘనంగా స్వాగతం పలికిన కమాండెంట్ ప్రభు కుమార్, బెటాలియన్ ప్రెసిడెంట్ తలారి పెద్దయ్య

**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం:** అనంతపురం జంతలూరు గ్రామంలోని 14వ బేటాలియన్ లో మూడు రోజులు పాటు జరిగిన సిబ్బంది స్పోర్ట్స్ మీట్ శుక్రవారం నాటితో ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ హాజరై పెరేడ్ గ్రౌండ్ డయాస్ ప్రారంభించారు. అదేవిధంగా పోలీస్ సిబ్బంది సంబంధించిన మెన్ డైరెక్టర్ భూమి పూజ నిర్వహించారు. అనంతరం వివిధ ఆటల్లో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ




సందర్భంగా ఆమె మాట్లాడుతూ....ఇలాంటి స్పోర్ట్స్ మీట్ కార్యక్రమాలు చేయడం వల్ల పోలీస్ సిబ్బంది మధ్య స్నేహపూర్వక వాతావరణం పెంపొం దుతుందన్నారు. 14 బెటాలియన్ పోలీస్ ఆఫీసర్స్, సిబ్బంది అభివృద్ధి కొరకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జేఎన్టీయూ స్పోర్ట్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ జోజిరెడ్డి , అడిషనల్ కమాండెంట్ కేశవరెడ్డి, ఏసీబీ డిఎస్పి ప్రసాద్ రెడ్డి, డీఎస్పీ వెంకట శివారెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్ మహబూబ్ బాషా, యూనిట్ డాక్టర్ ఆదిశేషు, బుక్కరాయసముద్రం ఎంపీపీ సునీత, బి కే ఎస్ డి కృష్ణ జ్యోతి, ఏపీ జెఎసి అమరావతి చైర్మన్ దివాకర్ రావు మరియు సభ్యులు, మరియు ఆఫీసర్స్ సిబ్బంది, పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మా గాంధీ బోధనలే ప్రపంచానికి శ్రీరామరక్ష

## - డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లె - సూర్య వాస్తవం :** మహాత్మా గాంధీ బోధనలే ప్రపంచానికి శ్రీరామరక్ష అని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లిలో మహాత్మా గాంధీ 78వ వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ మానవ ఇతిహాసంలోనే ఒక విశిష్టమైన, విలక్షణమైన నాయకుడు మహాత్మా గాంధీ అన్నారు. ఆయన చరితార్థుడు, చరిత్రకారుడు, కారణజన్ముడు, యుగపురుషుడు అని కీర్తించారు. మహాత్ముని ఆయుధాలు అయిన సత్యం, అహింస, సత్యాగ్రహం, నిరాడంబరత వీటికి కాల దోషం లేదని, సార్వకాలీనం, సార్వజనీనం, సార్వ ప్రాంతీయం అన్నారు. ఈ ఆయుధాలతోనే రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాధి నేతలను భారతదేశపు పొలిమేరల నుండి వెళ్ళగొట్టి భారతమాత దాస్య శృంఖలాలను ఛేదించి భారతదేశానికి స్వాతంత్రం తెచ్చాడన్నారు. మహాత్ముడు కేవలం భారత జాతిపిత గానే కాకుండా ప్రపంచ నేత అన్నారు. ఉగ్రవాదం, తీవ్రవాదం, ఫ్యాక్షనిజం, నక్సలిజం మానవ సమాజాన్ని అతలాకుతలం చేస్తున్న నేటి రోజుల్లో గాంధీ మార్గమే శరణ్యం అన్నారు. ప్రస్తుతం దేశంలో గాంధీజీ వాదానికి గాడ్సే వాదానికి సైద్ధాంతిక పోరాటం జరుగుతోంది. నాడు నాథూరామ్ గాడ్సే మహాత్మా గాంధీని భౌతికంగా హత్య చేయగా నేడు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రతి రోజు మహాత్ముని భావజాలాన్ని హత్య చేస్తూ ఉంది.

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పల్లె ప్రజల పాశుపతాస్త్రం. గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణ ప్రాంతాలకు వలసలు నివారించే సదుద్దేశంతో 2006 ఫిబ్రవరి 2వ తేదీన నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించింది.కేంద్ర ప్రభుత్వం 90 శాతం నిధులు భరించే విధంగా రాష్ట్రాలపై ఆర్థిక భారం పడకుండా ఈ పథకానికి రూపకల్పన జరిగింది. గ్రామ స్వరాజ్యం కోసం కలలుగన్న మహాత్ముని పేరుతో ఈ పథకానికి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అని పేరు పెట్టడం జరిగింది.కానీ దురదృష్టవశాత్తు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మహాత్మా గాంధీ పేరు తొలగించడం శోచనీయం .ఇది మహాత్ముని అవమానించడమే అవుతుంది. జాతిపితను అవమానించడం అంటే మొత్తం జాతిని అవమానించడమే అవుతుంది.కొత్త చట్టం ప్రకారం కేంద్రం వాటా 90 శాతం నుండి 60 శాతానికి తగ్గించడం, రాష్ట్రం వాటా పది శాతం నుండి 40 శాతానికి పెంచడం వల్ల రాష్ట్రాలపై ఆర్థిక భారం ఎక్కువై క్రమేనా ఈ పథకం నిర్వీర్యమై కాలగర్భంలో కలిసిపోయే ప్రమాదం ఉంది. కొత్త చట్టాన్ని రద్దుచేసి పాత పథకమైన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధాతధంగా అమలు చేయాలని తులసి రెడ్డి మోడీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఈ విషయంలో రాష్ట్రానికి చెందిన ప్రాంతీయ పార్టీలు టిడిపి, జనసేన,వైకాపా మోడీ ప్రభుత్వానికి మద్దతు ఇవ్వడం అత్యంత దురదృష్టకరం అన్నారు అన్నారు. వర్ధంతి కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం, శ్రీమతి అలివేలమ్మ, వేంపల్లి మండల శాఖ అధ్యక్షులు రామకృష్ణ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, బండారు వెంకటేశు బద్రీనాథ్, రాఘవయ్య, నామా వినయ్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు మానవతా చేయూత



**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం:** పదవ తరగతిలో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు మానవతా చేయూతనందిస్తుందని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఛైర్మన్ బాలసుబ్రమణ్యం పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్లో పదవ తరగతిలో మంచి ఫలితాలు సాధించిన సౌమ్యశ్రీ, తేజశ్రీ వెంకట సాయి కుమారి లకు ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ మార్చిలో జరగబోవు 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మండల స్థాయిలో మంచి మార్కులు వచ్చిన వారికి మానవతా తరఫున నగదు బహుమతులు అందజేస్తామన్నారు. అంతేకాకుండా పేద విద్యార్థులకు పై చదువులు చదువుకోవడానికి మానవత 25వేల నుంచి 50 వేల రూపాయల వరకు సహాయం చేస్తామని ఆయన అన్నారు. అంత కాకుండా ప్రతి ఏటా మానవతా తరఫున నిరుపేదలకు అనారోగ్యతో బాధపడే వారికి పేద విద్యార్థు లకు తమ వంతు ఆర్థిక సాయాన్ని అందజేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మానవత మండల అధ్యక్షుడు మాజీ ఎంపీపీ ఉమాపతి రెడ్డి, మానవతా సభ్యులు పకీరయ్య, శివయ్య, ఉపాధ్యాయుడు జాఫర్ విద్యార్థులు పాల్గొన్నారు.

# సంక్షేమ, చేనేత, జౌళిశాఖ మంత్రిని కలిసిన పెరమసాని రామాంజనేయులు





**పామిడి - సూర్య వాస్తవం :**

గుత్తి పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో గల కేంద్రీయ విద్యాలయం ఎదురుగా ఉన్న అక్షలభారత ఆరే కటిక కుల దేవతలు శ్రీ సునామ జాకీనిమాతను 23వ వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్ర బీసీ ఈడబ్ల్యూఎస్ సంక్షేమ చేనేత జోలి శాఖ మంత్రి ఎస్.సవిత పాల్గొని ఆలయంలో ప్రత్యేకమైన పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, రాష్ట్ర కార్మికసంక్షేమశాఖ బోర్డు చైర్మన్ వెంకటశివుడు యాదవ్, ఆరే కటిక డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ హెచ్.హరికృష్ణ, తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక నుంచి పెద్ద ఎత్తున ఆరెకటిక కులస్తులు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుత్తి పట్టణంలోని ఆర్ అండ్ బి బంగ్లాలో కార్మిక సంక్షేమశాఖబోర్డు చైర్మన్ వెంకటశివుడు యాదవ్ తోపాటు పామిడి మండలం టిడిపి యువనాయకుడు పెరమసాని రామాంజనేయులు కలసి పామిడి పట్టణంలో పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన వేలాది నిరుపేద కుటుంబాలు కేవలం కుట్టు మిషన్లపై ఆధారపడి జీవిస్తున్నారని, వారికి బ్రతుకు ఆధారంగా పామిడిలో మూతబడిన చేనేత జౌళీ శాఖకు సంబంధించిన అప్రెల్ సెంటరును తిరిగి ప్రారంభించి పూర్వ వైభవాన్ని పునరుద్ధరించి నిరుపేదలను ఆదుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని మంత్రి దృష్టికి తెలిపారు. అందుకు ఆమె స్పందించి త్వరలోనే పామిడి అప్రెల్ సెంటర్ను అభివృద్ధిని పునరుద్ధరిద్దామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

# శ్రీ సునామా జకిని మాత అమ్మవారి 23వ వార్షికోత్సవ వేడుకలు





**గుత్తి - సూర్య వాస్తవం:** గుత్తి పట్టణం గుత్తి ఆర్ఎస్లో ఉన్న సునామ జకనీమాత దేవి మహోత్సవానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర చేనేత, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవి తమ్మ గుంతకల్లు నియోజకవ ర్గం శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం రాష్ట్ర కార్మిక సం క్షేమ శాఖ బోర్డు ఛైర్మన్ వెంకట శివుడు యాదవ్ ముందుగా జకని మాత దేవాలయ కమిటీ వారు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు జకని మాత అమ్మవారిని దర్శించుకున్న అనంతరం రాష్ట్ర మంత్రి సవితమ్మ , గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ ఇండియాలోనే జకని మాత దేవాలయం ఎక్కడ లేదు మన గుంతకల్ నియోజకవర్గం గుత్తి పట్టణంలో జకని మాత దేవాలయం ఉండడం ఇక్కడున్న కటిక సోదరులు చాలా అదృష్టవంతులని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన తర్వాత కటిక సోదరులను చాలా ఆదుకుంది. అలాగే రాబోయే రోజులలో వారికి పెద్ద పీఠం వేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గుత్తి పట్టణం, మండల ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





# మెరిసిన ముత్యాలు

### - ఇద్దరు ఎక్సైజ్ ఎస్ఐలు, ఒకరు డిప్యూటీ తహాశీల్దార్‌గా ఎంపిక
### - గ్రూప్-2 ఫలితాల్లో శ్రీచైతన్య పూర్వ విద్యార్థుల ప్రతిభ
### - హర్షం వ్యక్తం చేసిన కరస్పాండెంట్ బండ్రెడ్డి చక్రపాణిరెడ్డి

**వేంపల్లె - సూర్య వాస్తవం:** ఇటీవల విడుదలైన గ్రూప్-2 ఫలితాల్లో స్థానిక శ్రీచైతన్య ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులైన గంగవరం దినేష్ కుమార్ రెడ్డి(2014 బ్యాచ్), దేవిరెడ్డి దినేష్ కుమార్ రెడ్డి(2008), నూనె వెంకట అజయ్(2014) లు తమ ప్రతిభను చాటుకున్నారు. జీ.దినేష్ కుమార్ రెడ్డి, డి.దినేష్ రెడ్డిలు ఎక్సైజ్ ఎస్సైలు, ఎన్.వి.అజయ్ డిప్యూటీ తహసీల్దార్ గా ఎంపికయ్యారు. వీరు ముగ్గురు స్థానిక శ్రీచైతన్య ఉన్నత పాఠశాలలో పదవ తరగతి వరకు చదువుకున్నారు. క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం కలిగి ఉంటే ఎదైనా సాధించవచ్చని ఆ పాఠశాల కరస్పాండెంట్ బండ్రెడ్డి చక్రపాణిరెడ్డి వెల్లడించారు. తమ పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులకు ప్రభుత్వ రంగాల్లో ఉద్యోగం సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. వీరి విజయాన్ని ప్రస్తుత విధ్యార్థులు స్ఫూర్తితో ముందుకెళ్లి భవిష్యత్‌లో తమ అత్యుత్తమ ప్రతిభ కనబరచి పాఠశాలతో పాటు తల్లి దండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# సిఎస్ఆర్ నిధులతో గ్రామాభివృద్ధికి పరిశ్రమలు ముందుకు రావాలి

### - స్థానిక యువతకు ఉద్యోగాల కల్పనలో ప్రాధాన్యం ఇవ్వాలి
### - ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ



**నాయుడుపేట- సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా నాయుడుపేట మండలంలోని మేనకూరు సెజ్ పరిధిలోని పరిశ్రమల యాజ మాన్యాలు తమ సి.ఎస్.ఆర్ నిధులను వినియోగించి చుట్టుపక్కల గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. పరిశ్రమల అభివృద్ధితో పాటు గ్రామాల సంక్షేమం కూడా సమాంతరంగా సాగాలని ఆమె స్పష్టం చేశారు. శుక్రవారం మేనకూరు సెజ్‌లోని కెవిఎం ప్రాజెక్ట్ - సిర్మా కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, పరిశ్రమలు సామాజిక బాధ్యతగా గ్రామాల్లో మౌలిక వసతులు, ఆరోగ్యం, విద్య రంగాలపై దృష్టి సారించాలని సూచించారు. అలాగే పరిశ్రమల్లో స్థానిక నిరుద్యోగ యువతకు ఎక్కువగా ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్ర హ్మణ్యం, తెలుగుదేశం పార్టీ నాయకులు పార్థసారథి, కట్టా వెంకటరమణారెడ్డి, సిర్మా పరిశ్రమ ప్రతినిధులు, 'మేమున్నాం' ఫౌండేషన్ వ్యవస్థాపకులు కె. గోపి తదితరులు పాల్గొన్నారు.

# బైకు ఆటో ఢీ

### - మున్సిపాలిటీ వర్క్ ఇన్‌స్పెక్టర్‌కి గాయాలు



**గుత్తి - సూర్య వాస్తవం:** గుత్తి పట్టణంలోని శుక్రవారం తాడి పత్రి రోడ్డు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు సమీపంలో నాలుగు గంటల సమయంలో ద్విచక్రవాహనం ఆటో ఒకటికొకటి ఢీకొన్నాయి. మున్సిపాలిటీ వర్క్ ఇన్‌స్పెక్టం పి.శ్రీనివాసులు తీవ్రంగా గాయపడడంతో గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాలు కన్నుకు గాయాలు కావడంతో మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )